ఆదివారం
ప్రజాశక్తి
మార్చి 7, 2004

క్రికెట్టే గెలిచింది

హ్యాపీ బర్త్‌డే

(7-3-2004నుండి 13-3-2004వరకు)

సిహెచ్.మంజుభార్గవి
4సం॥,7.3.2000
కళ్యాణి-రవికుమార్
వలేటివారిపాలెం-ప్రకాశం

జె. రచన
2సం॥,8.3.2002
జయశ్రీ-ప్రవీణ్‌కుమార్‌గౌడ్
ఆశలపల్లి-వరంగల్

కె. అర్చన
1సం॥,8.3.2003
పద్మ-రవి
అమరచింత-మ॥నగర్

సన్ని
4సం॥, 10.3.2000
సువర్ణ-ఎలియా
గూడూరు-వరంగల్

ఎల్. లావణ్య
3సం॥, 10-3-2001
శ్రీఉష-హనుమంతరావు
బడంగ్‌పేట-రంగారెడ్డి



పి. లక్ష్మీశ్రేష్ఠ
1సం॥, మార్చి-2003
రజని-దామోదర్
అడిక్‌మెట్-హైదరాబాద్

ఆసీఫ్
అయిషా-అహమ్మద్
దామరమడుగు-నెల్లూరు

లోకేష్
3సం॥, - 2001
ఝూన్సీభాయి-క్రిష్ణ
రావినూతల-ఖమ్మం

ఎస్.భార్గవి
శ్రీలక్ష్మీ-సాయిబాబు
ఆకివీడు-ప॥గో॥

వరలక్ష్మీ
4సం॥,మార్చి-2000
సత్యవతి-యాదగిరి
మిర్యాలగూడ

సి.మధు
2సం॥,మార్చి-2002
సువర్ణమ్మ-నాగేంద్ర
రాగులపాడు-అనంతపురం

సదీప్‌కుమార్
10సం॥,13.3.1994
ఉమారాణి-నర్సింగరావు
జియాగూడ-హైదరాబాద్

సృజిత్‌దాచూరు(టింకు)
అమరావతి-శ్రీనివాసరావు
బాలాజీనగర్-నెల్లూరు

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



బిజెపి నిజస్వరూపం తెలిసింది

భారతీయ జనతాపార్టీ పూర్వరంగం, దాని నిజస్వరూపాన్ని తెలియచేస్తూ ఫిబ్రవరి 22వ తేదీ సంచికలో ప్రచురించిన మేడిపండు బిజెపి కవర్‌స్టోరీ బాగుంది. బిజెపి ఒక పార్టీగా కాకుండా ఈ దేశాన్ని మెజారిటీ మతంవారే పాలించాలి, వారే ఇక్కడ జీవించాలనే సిద్ధాంతంతో పనిచేస్తుందని ఈ స్టోరీ ద్వారా తెలుసుకోగలిగాము. జాతీయోద్యమం మొదలు స్వతంత్ర భారతం ఆవిర్భవించిన నాటి నుండి జనసంఘ్, తర్వాత బిజెపి పేరుతో సంఘపరివార్ నాయకుల ఎత్తులు, జిత్తులు చక్కగా వివరించారు. ప్రజలను మతాల వారీగా చూసే, విభజించే అటువంటి పార్టీని అందరూ బహిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఎ. శివశంకర్
తాడిగడప, కృష్ణా జిల్లా

రియల్‌స్టోరీ కదిలించింది

ఫిబ్రవరి 22వ తేదీ సంచికలో ప్రచురించిన రియల్ స్టోరీ శిథిలాల నుండి ఏడడుగులు కదిలించింది. గుజరాత్‌లో సంభవించిన భూకంపంలో అనాథలుగా మారినవారి భవిష్యత్ అంధకార బంధురం అయ్యేంటుంది. అటువంటి వారిలో ఒక యువతికైనా మంచి నీడ దొరికినందుకు, ఆ కథను ప్రజాశక్తి ప్రచురించినందుకు సంతోషం. బిజెపి మేడిపండు కవర్‌స్టోరీ ద్వారా ఆ పార్టీ నిజస్వరూపాన్ని తెలుసుకోగలిగాము. ఆదివారం అనుబంధంలో మంచి శీర్షికలు ఇస్తున్నందుకు ధన్యవాదాలు.

– సిహెచ్. పవన్‌కుమార్, తిరుపతి.
పి. పాపారావు, ఆత్మకూరు, కర్నూల్ జిల్లా

కథ బాగుంది

ఫిబ్రవరి 22వ తేదీ సంచికలో ప్రచురించిన అనాథ కథ బాగుంది. అయితే కథను ఇంకా చక్కగా మలచవచ్చు. రచయిత తన ఆలోచనలకు మరింత పదును పెట్టినట్లయితే కథ ప్రాధాన్యంగా తయారయ్యేది. ఈ సంచికలోని అన్ని శీర్షికలు చాలా బాగున్నాయి. బిజెపిపై రాసిన కవర్ స్టోరీ, టూరిస్ట్‌గైడ్ ఎంతో ఆసక్తికరంగా ఉన్నాయి. న్యాయసలహాలు, రుచి క్రమం తప్పకుండా ఇస్తున్నందుకు ప్రజాశక్తికి అభినందనలు.

– ఎ.బ్రహ్మాజీ, పిఠాపురం, తూ.గో.
– ఆర్. యాదగిరి, భువనగిరి, నల్గొండ

ఆరోగ్యం పేజీ ఉపయోగకరంగా ఉంది



22 ఫిబ్రవరి 2004 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలోని ఆరోగ్యం పేజీలోని 'మూత్రకోవ్యాధులు', వాని కారణాలు, మూత్రపిండాలలో ఏ విధంగా రాళ్ళు ఏర్పడతాయి. నివారణ మార్గాలు, యూరాలజీ గూర్చి అనేక విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది. ఆరోగ్యం పేజీ ఫైల్ చేస్తున్నాను. ఇంకా మంచి ఆరోగ్య సంబంధమైన చిట్కాలు ఇవ్వగలరు. కార్టూన్ కదంబం, బాలల కథలు బాగుంటున్నాయి.

– కామిడి సతీష్ రెడ్డి ,
జడలపేట, వరంగల్ జిల్లా

చేతుల్లేని సరస్వతి

రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'చేతుల్లేని సరస్వతి' కదిలించింది. రెండు చేతుల్లేని సవితను చూచి చలించిపోయిన ఒకాయన ఆమె చదువుకునేలా చేయటం మానత్వానికి మరణం లేదనిపించింది. చేతులున్న వాళ్ళు సాధించలేని విజయాన్ని చేతుల్లేకుండా సాధించిన చిన్నారి సవిత అభినందనీయురాలు.

– షేక్ ఆలీవలి, మొగల్తూరు

మనిషికి సుఖం లేదంతే !

అంతా మిధ్య -

నేను మీరు వారు - సమస్తం మిధ్య

ఆ మాటకొస్తే -

కనిపించేది మిధ్య! వినిపించేది మిధ్య!

ఎక్కడ్నించి వచ్చేమో తెలీదు. ఎక్కడికి వెడతామో తెలీదు. ఇక్కడ ఎంతకాలం కేంపు పెడతామో అంతకంటే తెలీదు!

ఇక్కడున్న కొద్ది రోజులూ -

నా ఇల్లూ నా పిల్లలూ అని పేర్లు పెట్టుకుని మురిసిపోతాం. నా కోడీ నాకుక్క అని వాటిని సొంతం చేసుకుని సంతోషిస్తుంటాం. ఇదిగిదిగో నా అడ్రస్సని అడిగిన వాళ్ళందరికీ చెబుతుంటాం!

ఇన్ని ఏర్పాట్లూ శాశ్వతమనుకుంటాం!

ఈ తరుణంలో -

ఎవడు పిలుస్తాడో తెలీదు. ఎప్పుడు పిలుస్తాడో తెలీదు. ఎందుకు పిలుస్తాడో అంతకంటే తెలీదు!

పిలుపు చేరిన వెంటనే -

ఇక సెలవంటాం. ఎక్కడికి ప్రయాణమో తెలీకుండానే వెళ్ళిపోతాం!

మనిష్టంతో ఇక్కడికి రాలేదు. మనిష్టంతోనే అక్కడకు పోవడం లేదు. మన ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండానే -

వస్తుంటాం. పోతుంటాం!

ఈ రాకపోకల మధ్య కాలంలో మాత్రమే బతుకుతుంటాం. మనది అంతంత మాత్రపు బతుకు... బుద్బుధ ప్రాయమైన బతుకు... అశాశ్వతమైన ఈ బతుకులో -

కొన్ని బంధాలకు దాసోహమంటున్నాం!

కొన్ని మమతలు పెంచుకుంటున్నాం!

కొన్ని అనురాగాలకు బందీలవుతున్నాం!

అన్నీ తెలిసి అన్నిటిమీదా మనసు పారేసుకునే మనిషెంత పిచ్చి వాడూ?

అతడ్ని పిచ్చివాడ్ని చేసే మనసెంత చిత్రమైనది? మనిషికి మనసే తీరని శిక్ష అనే జీవిత రహస్యాన్ని తెలుసుకున్న మనసుకవి కూడా వెళ్ళిపోయేడు!

మనసు గతి యింతే!

మనిషి బతుకింతే!

మనసున్న మనిషికి సుఖములేదంతే!

అసలే మిధ్య. అందులో

మనసు గొడవ. ఇంకెక్కడి సుఖం?

మనిషికి సుఖం లేదంతే!

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...



నేనెవరిని ?

కథ ... 8, 9

ఎదిగిన ఎవరెస్ట్ శిఖరం

రియల్‌స్టోరీ... 14, 15



తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడు

టూరిస్ట్ గైడ్ . . . 21

మట్టిలో మాణిక్యాలు వెలికితీసిన 'తాటికొండ'

కళాసాహితి . . . 22, 23

ఓరా!



మహాకవి - రాజకీయ ముని

మునులు, బాబాలు రకరకాలుగా ఉంటారు. ఎన్నికల సీజన్‌లో వారికి బాగా డిమాండ్ ఉంటుంది కూడా. మధ్యప్రదేశ్‌లో మౌనిబాబా సుందర్‌లాల్ అనే 75 ఏళ్ళ వ్యక్తి పద్దెనిమిది సంవత్సరాల తర్వాత ఇటీవల తన మౌనవ్రతాన్ని వీడి నోరువిప్పారట! 1986లో ఒక రోడ్డు ప్రమాదంలో వికలాంగుడైన సుందర్‌లాల్ అప్పటినుండి మౌనవ్రతాన్ని పాటిస్తున్నాడట. బిజెపి అభిమాని అయిన ఆ వ్యక్తి వాజ్‌పేయి ప్రధాని అయ్యేంతవరకు, తనను కలిసేవరకు నోరువిప్పేది లేదని భీష్మించుకున్నాడట?! కూర్చున్న చోటు నుండి కదలకపోవడం, నోరు విప్పకపోవడంతో 18 ఏళ్ళ నుండి సుందరలాల్ మౌనమునిగా ఆరాధనలందుకుంటున్నాడు. ప్రధాని వాజ్‌పేయి ఇటీవల ఆయన ఉండే గ్రామం సమీపాన ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్ళినపుడు కేంద్రమంత్రి ఒకరు మౌనబాబాకు, వాజ్‌పేయికి తన నివాసంలో భేటీ ఏర్పాటుచేశారు. 18 ఏళ్ళ విరామం తర్వాత తొలిసారిగా నోరు విప్పిన మౌనబాబా ప్రధాని ఎదుట 'జై శ్రీరాం' అంటూ నినదించాడట!?

పెళ్ళిళ్ళకు గూండాల బెడద



ముంబాయి నగరంలోని జుహు ప్రాంతంలో పెళ్ళి ఊరేగింపులకు గూండాల బెదిరింపులు ఎక్కువయ్యాయి. తమ నివాసాల నుండి పెళ్ళి మండపాల వరకు గుర్రాలపై అట్టహాసంగా తరలివెళ్ళే పెళ్ళి బృందాలపై హఠాత్తుగా గూండా తండాలు దాడిచేసి రౌడీ మామూళ్ళు అడుగుతున్నారట! శుభకార్యం చేసుకోబోతూ గొడవలెందుకని పెళ్ళి కొడుకు తరఫువారు గూండాలకు అడిగినంత దక్షిణ సమర్పించుకుని ఊపిరి పీల్చుకుంటున్నారు. సంపాదన బాగుండటంతో ఈమధ్య పెళ్ళి బృందాలను బెదిరించి డబ్బు దండుకునే గ్యాంగులు ఎక్కువయ్యాయుట! పోలీసులు కూడా ఈ సమస్యను తీవ్రంగా తీసుకోవడంలేదని వినిపిస్తోంది. కొద్ది రోజుల క్రితం ఇదేవిధంగా భారీ ఎత్తున తరలివస్తున్న పెళ్ళి బృందాన్నొకదాన్ని రోడ్డు మీద నిలవేశారట. గూండాల బెదిరింపులకు భయపడిన పెళ్ళి కొడుకు గుర్రం దిగి కారులో పెళ్ళిమండపానికి పారిపోగా, మిగిలిన వారు కూడా కార్లలో ఉడాయించారట. ఇక అక్కడ మిగిలిన కొద్దిమంది పెళ్ళివారిని, బ్యాండ్‌మేళం వారిని, దీపాలు మోస్తున్నవారిని గూండాలు చితకబాది వదిలారట! పాపం!?

లెట్రిన్స్ కూలుస్తున్న మెట్రోరైల్వే!?

ముంబాయిలో నగరపాలకసంస్థ చేయాల్సిన కూల్చివేత కార్యక్రమాలను మెట్రో రైల్వే అధికారులు నిర్వహిస్తున్నారట! మనదేశంలో జాతీయ రహదారులు, రైల్వేపట్టాల వెంట ఉదయం సమయాల్లో మల, మూత్రవిసర్జన మామూలే. ఈ సమస్యను అధిగమించడానికి మున్సిపల్ కార్పొరేషన్ మెట్రోరైల్ మార్గం వెంట పబ్లిక్ లెట్రిన్స్ నిర్మించారు. రైలుపట్టాల వెంట స్థలం రైల్వేది గనుక అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టినా తమ అనుమతి కావాల్సిందేనని, అనుమతి లేకుండా ఎవరు నిర్మించినా, ఏ నిధులతో నిర్మించాని సహించేది లేదని రైల్వే అధికారులు సెలవిచ్చారట! ముంబాయిలో పబ్లిక్ లెట్రిన్స్ కోసం ఒక విదేశీసంస్థ రు.164 కోట్ల ఆర్థికసాయం చేసింది. ఆ పథకంలో భాగంగా మెట్రోరైలు పట్టాల వెంట పరిశుభ్రత పాటిద్దామని నగరపాలకసంస్థ లెట్రిన్స్ నిర్మిస్తే స్థలం వివాదం రేపి మెట్రోరైల్ అధికారులు వాటిని కూల్చేశారుట! ఇదీ సంగతి.

కా ర్టూ న్ క దం బం


ఓటు
పెరిగిన ఎండలు


మతతత్వం కుంభకోణాలు
భారత్ ఉదయ్ యాత్ర


మీకు పువ్వాట! వాళ్ళకు ఓటట!!
ప్రతిపక్షాలు
బాబు బర్త్‌డే రోజుకే ఎన్నికలు
నారు


ఓటు
స్కాంలు
దౌర్జన్యం
మతతత్వం
మరోసారి అవకాశం ఇస్తే సూపర్‌పవర్‌గా భారత్
— అద్వానీ
నారు



ఎన్ని అవాంతరాలు ఎదురైనా...! ఎంతమంది అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించినా...!! ఎట్టకేలకు క్రికెట్టే గెలిచింది...!!! ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన చారిత్రాత్మక భారత్-పాకిస్తాన్ క్రికెట్ సిరీస్ ఈ వారాంతంలో వాస్తవరూపం దాల్చబోతోంది. భారత జట్టు తమ దేశంలో పర్యటించాలని 14 ఏళ్లుగా కళ్లు కాయలు కాచేలా ఎదురు చూసిన పాకిస్తాన్ కల నెరవేరబోతోంది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఉత్కంఠను రేకెత్తించే ఈ సిరీస్‌కు ఈనెల 13న కరాచీలో తొలి టెస్ట్‌తో తెరలేవనుంది.



క్రికెట్టే గెలిచింది



హసన్ షరీఫ్, మాధవి పిళ్ళే

దేశంలో అన్ని క్రీడలకంటే క్రికెట్‌కే ఆదరణ ఎక్కువ. భారత జట్టు ఎక్కడ, ఎవరితో క్రికెట్ ఆడినా టీవీలకు మనవాళ్లు అతుక్కుపోవడం చూస్తుంటాం. అందునా పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ అంటే అభిమానులకు పండగే. సరిహద్దు ఉగ్రవాదం పేరిట పాక్ పర్యటనకు భారత్ గత 14 సంవత్సరాలుగా నిరాకరిస్తూ వచ్చింది. ఎట్టకేలకు ఈ సిరీస్ ఆడేందుకు భారత్ అంగీకరించడం విశేషం. భారత్-పాక్‌ల మధ్య ఏ క్రీడ జరిగినా రెండు దేశాల ప్రజలు తమ జట్టే గెలవాలని కోరుకుంటారు. భారత్-పాక్ సిరీస్ ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీకంటే కూడా ఎక్కువ ప్రాచుర్యం పొందింది. ఈ సిరీస్ స్పాన్సర్‌షిప్ కోసం వివిధ బహుళజాతి సంస్థలు తీవ్రంగా పోటీపడ్డాయి. శ్యామ్‌సంగ్ కంపెనీ దీనిని కైవసం చేసుకుంది. సాధారణంగా క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ప్రకటనలు ఇవ్వడానికి ఎక్కువగా ఆసక్తి చూపే వాణిజ్య సంస్థలు ఈ సిరీస్ సందర్భంగా మరింత ఎగబడడం గమనార్హం. ఇంత ప్రజాదరణ పొందిన ఈ సిరీస్ జరగకుండా కొంతమంది స్వార్థపరులు పనిగట్టుకొని మరీ ప్రయత్నిస్తూ వచ్చారు. అయినా వారి ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పి కొడుతూ సిరీస్ విజయవంతానికి అభిమానులు నిరంతరం కృషి చేస్తూనే ఉన్నారు.

అడ్డుపుల్ల పెడ్తున్నవారెవరు?

భారత్, పాకిస్తాన్‌లు 1947లో విడిపోయినప్పుడు రెండు దేశాల్లోనూ మతకలహాలు చెలరేగాయి. ఆ సమయంలో మత ఛాందసులు చెలరేగి రెండు దేశాల మధ్య మరింత అగాధం సృష్టించడానికి ప్రయత్నించారు. ఈ ఉద్రిక్తతలు తగ్గకముందే 1952లో తొలిసారిగా భారత్‌లో పర్యటించాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది. క్రికెట్ సంబంధాల వల్ల రెండు దేశాల మధ్య వైరం తగ్గి శాంతి నెలకొంటుందనే ఆశ ఇరుదేశాల ప్రజల్లోనూ నెలకొంది. ఇప్పుడు జరుగబోయే సిరీస్‌లో భారత్ ఓడిపోతే ఫీల్‌గుడ్ తలకిందులై తమ జాతకాలు ఎక్కడ తారుమారవుతాయోనన్న భయం బిజెపికి, దాని మిత్రపక్షమైన తెలుగుదేశానికి పట్టుకుంది. అందుకే ఈ సిరీస్‌ను ఎన్నికలయ్యేదాకా వాయిదా వేయించాలని అవి ప్రయత్నించాయి. క్రీడలను రాజకీయంతో మిళితం చేయడం తగదని పత్రికలు, మేధావులు, ప్రజలు యావన్మంది గళం విప్పడంతో ఆ ఆలోచనను ప్రభుత్వం విరమించుకుని షెడ్యూల్ ప్రకారమే పాక్ టూర్ వుంటుందని ప్రకటించింది. ఆ విధంగా పాక్‌లో భారత్ క్రికెట్ టూర్‌కు లైన్ క్లియర్ అయింది.

భారత్‌లో ఆనాడు తొలి పర్యటన జరిపిన పాకిస్తాన్ జట్టుకు అబ్దుల్ కర్దార్ నేతృత్వం వహించాడు. భారత జట్టుకు లాలా అమర్‌నాథ్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఆ టెస్ట్ సిరీస్‌ను భారత్ 2-1తో గెల్చుకుంది. ఆ సిరీస్ సందర్భంగా భారత ప్రజలు తమ సోదర పాక్ క్రికెటర్లకు నీరాజనాలు పట్టారు. పంజాబ్‌లో పాక్ ఆటగాళ్లకు పౌర సన్మానం కూడా చేశారు. సొంత ఇంటికి వచ్చినట్లు ఉందని పాక్ కెప్టెన్ కర్దార్ వ్యాఖ్యానించాడు. పాక్ ఆటగాళ్లు భారత్ రావడాన్ని మత ఛాందస వాది అయిన జనసంఘ్ అధినేత వ్యతిరేకించాడు. తర్వాత 1954లో పాక్‌లో భారత జట్టు పర్యటించింది. అక్కడి ప్రజలు కూడా మన ఆటగాళ్లకు నీరాజనాలు పలికారు. ముఖ్యంగా భారత జట్టు మేనేజర్‌గా వెళ్లిన లాలా అమర్‌నాథ్‌ను లాహోర్ ప్రజలు సొంత వ్యక్తిగా ఆదరించారు. (లాలా అమర్‌నాథ్ క్రికెట్ ఓనమాలను లాహోర్‌లోనే నేర్చుకున్నాడు.)

కానీ ఇక్కడిమాదిరే పాక్ మత ఛాందసులు కూడా భారత ఆటగాళ్ల రాకను సహించలేకపోయారు. ఆ సిరీస్‌లో జరిగిన టెస్టులన్నీ డ్రాగా ముగిశాయి. 1960-61లో పాకిస్తాన్ జట్టు మళ్లీ భారత్‌లో పర్యటించింది. తర్వాత భారత్-పాక్ మధ్య యుద్ధం జరిగింది. ఫలితంగా రెండు దేశాల మధ్య ఇతర దౌత్య సంబంధాలతో పాటు క్రికెట్ సంబంధాలు కూడా

ఆసిఫ్ ఇక్బాల్ మనవాడే



హైదరాబాద్‌లో పుట్టి పాకిస్తాన్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న వ్యక్తి ఆసిఫ్ ఇక్బాల్. ఇక్బాల్ పేరు ప్రస్తావించకుండా భారత్-పాకిస్తాన్ సిరీస్ గురించి చెప్పడం అసంపూర్తిగానే ఉంటుందని క్రీడా పండితులు అంటారు. స్థానిక నిజాం కాలేజీలో డిగ్రీ చేసిన ఇక్బాల్ రంజీట్రోఫీ పోటీల్లో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. హైదరాబాద్ మేటి క్రికెటర్లు గులాం అహ్మద్, ఎంఎల్ జయసింహ వంటి హేమాహేమీలతో అతను కలిసి ఆడాడు. గులాం అహ్మద్ మేనల్లుడు అయిన ఇక్బాల్ 1960వ దశకంలో పాకిస్తాన్ వెళ్లాడు. 1979-80లో భారత్‌లో పర్యటించిన పాకిస్తాన్ జట్టుకు ఇక్బాల్ నేతృత్వం వహించాడు. పాక్ తరఫున అతను 58 టెస్ట్‌మ్యాచ్‌లు ఆడాడు.

ఆ ముగ్గురి అనుబంధం...

భారత్-పాకిస్తాన్ అనుబంధం ఎలాంటిదో క్రికెట్‌లో ఈ ముగ్గురి బంధం కూడా అలాంటిదే. ఆ ముగ్గురు కపిల్ దేవ్, సచిన్ టెండూల్కర్, వకార్ యూనిస్. పాక్‌పై కెరీర్ ప్రారంభించిన కపిల్, సచిన్‌లు ప్రపంచ ఉత్తమ క్రికెటర్లుగా నిలిచి భారత్‌కు గర్వకారకులయ్యారు. 1978-79లో కపిల్ దేవ్ టెస్ట్ రంగ ప్రవేశం చేశాడు. కపిల్ తొలి టెస్ట్‌మ్యాచ్‌ను పాకిస్తాన్‌పై ఫైసలాబాద్‌లో ఆడాడు. భారత్ చివరిసారిగా 1989-90లో పాకిస్తాన్ పర్యటించినప్పుడు కూడా కపిల్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అంటే కపిల్ దేవ్ వందవ టెస్ట్‌మ్యాచ్‌ను పాకిస్తాన్‌పైనే 11 సంవత్సరాల తరువాత కరాచీలో ఆడాడు. తొలి, వందవ టెస్ట్ మ్యాచ్‌లను పాకిస్తాన్‌పై ఆడే అరుదైన అవకాశాన్ని కపిల్ పొందడం విశేషం. సచిన్ టెండూల్కర్-వకార్ యూనిస్‌లు ఒకే మ్యాచ్‌లో తమ అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించడం మరో విశేషం. వీరు తొలి టెస్ట్‌మ్యాచ్‌ను 1989-90లో కరాచీలో ఆడారు. వన్డే కెరీర్‌ను కూడా ఒకేసారి గుజ్రాన్‌వాలాలో ప్రారంభించారు.

ఇద్దరు జీరోలు-తరువాత హీరోలు

తొలి టెస్ట్‌లో సచిన్ టెడూల్కర్, వకార్ యూనిస్‌లు సున్నా పరుగులకే అవుటయ్యారు. జీరోతో కెరీర్ ప్రారంభించిన వీరు తర్వాత రికార్డులమీద రికార్డులు నెలకొల్పారు. ఈ సిరీస్‌లో ఆడే అవకాశం కల్పించాల్సిందిగా వకార్ పిసిబికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రాబబుల్స్‌లో అవకాశం కల్పించలేదు. పాకిస్తాన్‌తో తన తొలి టెస్ట్ ఆడిన సచిన్ ఈ సిరీస్‌లో ఏ రికార్డు నెలకొల్పుతాడో వేచిచూడాలి.

తెగిపోయాయి. 1978-79లో మళ్లీ రెండు దేశాల మధ్య క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇన్ని అవాంతరాలు ఎదురైనందున భారత్-పాక్‌లు విడిపోయి 57 సంవత్సరాలు అయినప్పటికీ రెండు దేశాల మధ్య 47 టెస్ట్‌మ్యాచ్‌లు మాత్రమే జరిగాయి.

భారత్‌లో పాక్ జట్టు చివరిసారిగా 1998-99లో పర్యటించింది. ఆనాడు భారత్ జట్టుకు అజారుద్దీన్ సారథ్యం వహించాడు. తర్వాత పాక్‌లో మన దేశం పర్యటించాల్సి ఉంది. తదనంతర కాలంలో పాక్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగాయి. ఇదే సమయంలో భారత్‌లో కూడా మతఛాందసులు అధికారం సంపాదించారు. గత 50 సంవత్సరాలుగా రగులుతున్న కాశ్మీర్ సమస్యను సాకుగా చూపిన సంఘ్‌పరివార్ నేతలు పాక్‌లో భారత జట్టు పర్యటించడాన్ని వ్యతిరేకించారు. పాక్ పర్యటనకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) శతధా ప్రయత్నించింది. బిసిసిఐ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎసి ముత్తయ్య కూడా ఇరు దేశాల సిరీస్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. ప్రస్తుత అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా అధ్యక్ష బాధ్యతలు తీసుకున్నప్పటి నుండి పాక్ పర్యటన కోసం చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే క్రికెట్‌ను రాజకీయాలతో ముడిపెట్టిన ఛాందసులు ఈ పర్యటన ప్రతిపాదనను ఎప్పటికప్పుడు తిరస్కరిస్తూ వచ్చారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తయారు చేసిన దీర్ఘకాల ప్రణాళిక ప్రకారం టెస్ట్ మ్యాచ్ ఆడే దేశాలన్నీ పది సంవత్సరాల కాలంలో మరో దేశంలో కనీసం ఒక్కసారైనా పర్యటించాలి. లేకుంటే పర్యటనకు తిరస్కరించే జట్టుపై భారీ జరిమానా విధిస్తామని ఐసిసి తన ప్రణాళికలో హెచ్చరించింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వడమే ఆలస్యం రెండు దేశాల క్రికెట్ బోర్డులు ఏర్పాట్లన్నీ చకచకా చేశాయి.

తండ్రి భారత్‌కు-కొడుకు పాకిస్తాన్‌కు

మహ్మద్ జహంగీర్ ఖాన్, మాజీద్ ఖాన్ తండ్రీకొడుకులు. అయితే వీరిలో తండ్రి భారత్ తరఫున ఆడితే, కొడుకు పాకిస్తాన్ తరఫున ఆడిన వింతైన సంఘటన చోటుచేసుకుంది. జహంగీర్ ఖాన్ భారత్ తరఫున నాలుగు టెస్టుల్లో పాల్గొన్నాడు. 1932లో ఒకటి, 1936లో మూడు టెస్ట్‌లను అతడు ఇంగ్లండ్‌పై ఆడాడు. పాకిస్తాన్ వేరుపడిన తర్వాత జహంగీర్ ఖాన్ ఆ దేశం వెళ్లినప్పటికీ అక్కడ క్రికెట్ ఆడలేదు. జహంగీర్ ఖాన్ కొడుకు మజీద్ ఖాన్ పాకిస్తాన్ తరఫున 63 టెస్టుల్లో పాల్గొన్నాడు. భారత్‌పై పది టెస్టులు ఆడిన మజీద్ పాక్ జట్టుకు నాయకత్వం కూడా వహించాడు.

వీరు రెండు దేశాల తరఫునా ఆడారు

అమీర్ ఇలాహీ, గుల్ మహ్మద్, అబ్దుల్ హఫీజ్ కర్దార్ 1948లో భారత్ తరఫున టెస్టుల్లో ఇంగ్లండ్‌పై ఆడారు. దేశవిభజన సమయంలో కొత్తగా

కాసుల వర్షం

భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ అంటే చాలు స్టేడియం ఫుల్ అవుతుంది. అంతేకాదు స్పాన్సర్లు కూడా ఎంతో మంది ముందుకు వస్తారు. వాణిజ్య సంస్థల, బహుళజాతి కంపెనీల హడావుడి వేరే చెప్పాలా. ఈ సిరీస్ ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు కొన్ని వందల కోట్ల రూపాయల వ్యాపారం చేసే అవకాశం ఉంది. భారత్-పాకిస్తాన్ సిరీస్‌ను 'శ్యామ్‌సంగ్ కప్' గా పిలుస్తారు. ఈ సిరీస్‌కు 'శ్యామ్‌సంగ్' కంపెనీ అధికారిక స్పాన్సరర్‌గా వుంది. దీనికోసం ఆ కంపెనీ చెల్లించిన మొత్తం అక్షరాలా 15 కోట్ల రూపాయలు. వీటికి తోడు బజాజ్ ఆటో, హీరోహోండాలతో పాటు చిన్నా చితక వాణిజ్య సంస్థలు కో-స్పాన్సరర్లుగా వ్యవహరిస్తున్నాయి. బజాజ్, హీరోహోండాలు తలా ఎనిమిది కోట్ల రూపాయలు చెల్లించాయి.

పిసిబి రాబడి వంద కోట్లు

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) ఈ సిరీస్‌పై గంపెడు ఆశలు పెట్టుకోవడానికి కారణం దానికి రానున్న ఆదాయమే. తమ దేశంలో పర్యటిస్తామని భారత జట్టు ప్రకటించడంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆనందానికి అవధుల్లేవు. అందుకే భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) విధించిన షరతులన్నిటికీ పిసిబి తలూపింది. తమ దేశంలో భారత జట్టు పర్యటిస్తే చాలు కోట్ల రూపాయల కాసుల పంట పండుతుందని పిసిబికి తెలుసు. ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు పాకిస్తాన్‌లో ఆడేందుకు ఇటీవల నిరాకరించడం వల్లే పిసిబి దివాళా తీసింది. ఆసీస్, విండీస్‌లు పాక్ జట్టుతో తటస్థ వేదిక అయిన షార్జా, శ్రీలంక దేశాల్లో ఆడడం వల్ల తనకు రావలసిన రాబడిని పిసిబి కోల్పోయింది. అలాగే పాకిస్తాన్ పర్యటనను న్యూజిలాండ్ క్రికెట్ జట్టు అర్ధాంతరంగా ముగించుకొని స్వదేశానికి వెళ్లిపోవడంతో ఆ సిరీస్‌కు కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన పిసిబి నిలువునా మునిగింది. ఈ దశలో నష్టాల నుండి బయటపడేందుకు పిసిబికి భారత్ సిరీస్ ఒక్కటే సరైన మార్గంగా కనిపించింది. భారత జట్టు తమ దేశంలో పర్యటించాల్సిందిగా పిసిబి పదేపదే డిమాండ్ చేయడం వెనుక ముఖ్య ఉద్దేశం కూడా ఇదే. ఈ సిరీస్ ద్వారా పిసిబి ఆదాయం అక్షరాలా వంద కోట్ల రూపాయలు.

పది సెకన్ల ప్రకటనకు 4.5 లక్షలు

టెన్ స్పోర్ట్స్ టెలివిజన్ ఛానెల్ షార్జాలో క్రికెట్‌కు ప్రాణం పోసిన బుఖాతిర్‌కు చెందినది. భారత్-పాక్ సిరీస్‌ను ప్రత్యక్ష ప్రసారం చేయడం ద్వారా టెన్‌స్పోర్ట్స్‌కు దాదాపు రెండు వందల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే వన్డే మ్యాచ్ ప్రసారం మధ్యలో వాణిజ్య ప్రకటన ఇవ్వాలనుకునే వాణిజ్య సంస్థలు చెల్లించాల్సిన ఖరీదు ఎంతో తెలుసా? పది సెకన్ల పాటు ప్రసారానికి అక్షరాలా 4.5 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్ సందర్భంగా వాణిజ్య సంస్థలు పది సెకన్ల ప్రకటనకు వన్డే మ్యాచ్ సమయంలో లక్షా యాభైవేల రూపాయలు, టెస్ట్ మ్యాచ్ సమయంలో 40 వేల రూపాయలు మాత్రమే చెల్లించాయి. అంతెందుకు 2003లో జరిగిన ప్రపంచకప్ సందర్భంగా సెట్‌మ్యాక్స్ ఛానెల్ వాణిజ్య ప్రకటనకు 10 సెకన్లకు వసూలు చేసిన రుసుం రెండు లక్షల 37 వేల రూపాయలు మాత్రమే. దీంతో భారత్-పాకిస్తాన్ వన్డే మ్యాచ్‌లకు ప్రపంచంలో ఎంత డిమాండ్ ఉందో తెలుస్తోంది.

బిసిసిఐ పరిస్థితి...?

ఈ సిరీస్ వల్ల బిసిసిఐకి గ్యారంటీ మనీ మాత్రమే లభిస్తుంది. ఈ సిరీస్‌లో ఆడిన ఒక్కొక్క క్రికెటర్‌కు సుమారుగా 16.50 లక్షల రూపాయలు అందుతాయి. అయితే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు భారత్‌లో ఈ సంవత్సరం అక్టోబర్ నెలలో పర్యటించనుంది. పాకిస్తాన్ జట్టు 2006లో మన దేశంలో పర్యటించాల్సి ఉంది. ఈ రెండు సిరీస్‌లలో ప్రసార హక్కులను అమ్మడం వల్ల బిసిసిఐ ఖజానాకు సుమారు 375 కోట్ల రూపాయలు చేరే అవకాశం ఉంది.

ఎవరి బలమెంత?

కవర్ స్టోరీ

	భారత్	పాకిస్తాన్
నాయకత్వం	సౌరవ్ గంగూలీ అనుభవం ఉన్న కెప్టెన్. వన్డేల్లో అత్యధిక విజయాలు అందించాడు. ఫీల్డింగ్ అమర్చడంలో దిట్ట. దేశ విదేశాల్లో పర్యటించిన అనుభవం, వాతావరణాలకు బాగా అలవాటు పడ్డవాడు.	నాయకత్వానికి ఇంజమామ్-ఉల్ హక్ కొత్త ప్రస్తుత జట్టులో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వాడు. భారత్‌తో నాయకుడిగా ఆడిన అనుభవం లేదు. అయితే జట్టులో కొత్తవారు కావడంతో నాయకత్వ సమస్య ఎదురుకాకపోవచ్చు
బ్యాటింగ్	బ్యాటింగ్‌లో చాలా పటిష్టంగా ఉంది. ప్రపంచ ఛాంపియన్ ఆస్ట్రేలియాను బ్యాటింగ్‌తో బెంబేలెత్తించారు. ప్రపంచంలో నెంబర్ వన్ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్, మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రావిడ్, మెరుపులు కురిపించే సౌరవ్ గంగూలీ, వీరేందర్ సెహవాగ్, యువరాజ్ సింగ్‌లే కాకుండా వివిఎస్ లక్ష్మణ్, మహ్మద్ కైఫ్, హేమాంగ్ బదానీ లాంటి బ్యాట్స్‌మెన్ చివర్లో భారీస్కోరు సాధించే సత్తాగలవారు. సచిన్ 328, ద్రావిడ్ 244, గంగూలీ 244, సెహవాగ్ 85, యువరాజ్ సింగ్ 89, లక్ష్మణ్ 68 వన్డే మ్యాచ్‌లు ఆడారు.	ఇంజామామ్-ఉల్ హక్‌తో పాటు యూసుఫ్ యెహానా, అబ్దుర్ రజాక్, సయీద్ అఫ్రిదీ, యూనిస్ ఖాన్‌లు అనుభవజ్ఞులు. అయితే భారత బ్యాట్స్‌మెన్‌తో పోలిస్తే వీరి అనుభవం తక్కువే. చాలామంది భారత బౌలర్లు గాయలతో ఉండడమే కాక అనిల్ కుంబ్లే, అజిత్ అగార్కర్ ఆడకపోవడం పాక్ బ్యాట్స్‌మెన్‌కు కలిసివచ్చే అంశం. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రాలు బౌలింగ్‌లో ఎంతవరకు రాణిస్తారో చెప్పలేం. సయీద్ అన్వర్ లాంటి అద్భుతమైన బ్యాట్స్‌మెన్ లేకపోవడం పాక్‌కు తీరని లోటు.
బౌలింగ్	బౌలింగ్‌లో భారత్ బలహీనత కొనసాగుతూనే ఉంది. అనిల్ కుంబ్లే అజిత్ అగార్కర్ అందుబాటులో లేకపోవడంతో ఇర్ఫాన్ పఠాన్‌పై అదనపు భారం పడినట్లే. జహీర్ ఖాన్, ఆశిష్ నెహ్రాలు బిసిసిఐకి ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌లు సమర్పించినప్పటికీ పూర్తిగా కోలుకున్న దాఖలాల్లేవు. గత పర్యటనలో మనోజ్ ప్రభాకర్, కపిల్ దేవ్‌లతో పాటు కొత్తవారైన సలీల్ అంకోలా, వివేక్ రజ్దాన్‌లు అద్భుతంగా రాణించారు. రిటైర్మెంట్ ప్రకటిం చిన అనుభవజ్ఞులైన జవగళ్ శ్రీనాథ్, వెంకటేశ్ ప్రసాద్‌ల స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోయారు.	షోయబ్ అక్తర్ మినహా చెప్పుకోదగ్గ బౌలర్లు లేరు. అయితే భారత్‌లో లేని ఆల్‌రౌండర్లు పాక్ జట్టుకు గొప్ప వరమే. అబ్దుర్ రజాక్, షాహిద్ అఫ్రిదీ, అజర్ మహమూద్, షోయబ్ మలిక్‌లాంటి ఆల్‌రౌండర్లు బంతితో ఎలాంటి అద్భుతమైనా చేయగలరు. మహ్మద్ సమీ గురించి పత్రికలు గొప్పగా చెప్తున్నప్పటికీ వన్డేల్లో అతని బౌలింగ్ సగటు సంతృప్తికరంగా లేదు. వన్డేల్లో 288 వికెట్లు తీసుకున్న సక్లాయిన్ ముస్తాక్‌పైనే పాక్ పూర్తిగా ఆధారపడాల్సిన స్థితి. వకార్ యూనిస్, వసీం అక్రం, ముస్తాక్ అహ్మద్ వంటి విజయం అందించే బౌలర్లు లేకపోవడం పెద్దలోటే.
ఫీల్డింగ్	వన్డే క్రికెట్ మ్యాచ్‌లో ఒక సామెత ఉంది..'క్యాచ్ విన్స్ మ్యాచ్'. వన్డేల్లో గెలవాలంటే ఫీల్డింగ్ మెరుగ్గా ఉండాలి. పాకిస్తాన్ జట్టుతో పోలిస్తే భారత జట్టు ఫీల్డింగ్ అద్భుతం. యువరాజ్ సింగ్, కైఫ్, గంగూలీ, సచిన్, బదానీల వంటి చురుకైన వారు ఎక్కడైనా ఫీల్డింగ్ చేయగల సత్తా కలిగి ఉన్నారు. వీళ్లు మైదానం నలుమైపులా మెరుపులా పరుగెత్త గలవారు. ఒత్తిడిలో పరుగులను విపరీతంగా ఇచ్చే అలవాటు భారత్ ఫీల్డర్లలో ఉంది. దాన్ని నివారించగలిగితే ఎదురుండదు.	ఫీల్డింగ్‌లో పాక్ వెనకబడినట్లే. భారీకాయంతో ఉన్న కెప్టెన్ ఇంజమామ్ అత్యధికసార్లు రనౌట్ అయిన బ్యాట్స్‌మన్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. సయీద్ అఫ్రిదీ, ఇమ్రాన్ నజీర్, యూనిస్ ఖాన్, యూసుఫ్ యెహానా, అబ్దుర్ రజాక్ లాంటి చురుకైన ఫీల్డర్లు ఉన్నప్పటికీ మిగిలినవారు వెనకబడినట్లే. ఫీల్డింగ్‌లో విఫలమైతే జట్టులో స్థానం ఉండదని ఆటగాళ్లను కోచ్ హెచ్చరించాడు. లాహోర్‌లోని శిక్షణా శిబిరంలో ఫీల్డింగ్‌పైనే పాక్ ఆటగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టారు.
కీపింగ్	భారత్‌కు ఉన్న అతిపెద్ద లోటు వికెట్ కీపింగ్. రాహుల్ ద్రావిడ్ బ్యాటింగ్‌లోనూ, కీపింగ్‌లోనూ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. తొలుత ఫీల్డింగ్ చేయాల్సి వస్తే ద్రావిడ్ బ్యాటింగ్‌పై తీవ్ర ప్రభావం పడ్తుంది. బ్యాటింగ్ లోనూ రాణించగల కీపర్‌ను వెతుక్కోపోతే భారత జట్టుకు కష్టమే.	మోయిన్ ఖాన్, రషీద్ లతీఫ్‌లు ఒకప్పుడు జట్టుకు నాయకత్వం వహించారు. భారత్‌తో జరిగే సిరీస్‌లో వీరిద్దరిలో ఎవరో ఒకరు అందుబాటులో ఉంటారు. ఇద్దరూ అనుభవజ్ఞులైన కీపర్లతో పాక్ జట్టు ఈ రంగంలో భారత్‌కంటే పైస్థాయిలోనే ఉంది.





ఏర్పడిన పాకిస్తాన్‌కు వారు తరలివెళ్లారు. ఇంపీరియల్ క్రికెట్ కౌన్సిల్ (ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్)లో పాకిస్తాన్ 1952లో సభ్యత్వం తీసుకున్న తరువాత వీరంతా ఆ దేశం తరఫున ఆడారు. అబ్దుల్ హఫీజ్ కర్దార్ పాకిస్తాన్ జట్టుకు తొలి కెప్టెన్ కావడం విశేషం.

కరాచీ అంటే ఎందుకు భయం?

గూండాలకు, మాఫియా డాన్‌లకు కరాచీ ప్రసిద్ధి. భారత్‌కు స్వాతంత్ర్యం రాకపూర్వం నుండే నేరాలకు ఆ నగరం ప్రసిద్ధి. పాకిస్తాన్ ఏర్పడ్డాక అది నేరగాళ్లకు నిలయంగా మారింది. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం ఇక్కడే నివసిస్తున్నట్లు పాక్ పత్రికలు తెలియజేశాయి. అక్కడ భారత జట్టు రెండుసార్లు రాళ్లవర్షాన్ని ఎదుర్కొన్నది. పాకిస్తాన్‌తో 1989 డిసెంబర్, 20న జరిగిన రెండవ వన్డే సమయంలో భారత జట్టు ప్రేక్షకుల నుండి తొలిసారి రాళ్ల వర్షాన్ని ఎదుర్కొన్నది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. మనోజ్ ప్రభాకర్ తొలి ఓవర్లోనే రమీజ్ రాజా (0)ను అవుట్ చేశాడు. సలీం మాలిక్ (0), జావెద్ మియాందాద్ (2) కూడా త్వరగా అవుట్ అవడంతో పాకిస్తాన్ 14.2 ఓవర్లలో 28 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాలపాలైంది. భారత బౌలర్లు మనోజ్ ప్రభాకర్, కపిల్ దేవ్, సలీల్ అంకోలా, రవిశాస్త్రి, మణీందర్ సింగ్‌ల బంతులను ఎదుర్కోవడానికి పాక్ బ్యాట్స్‌మెన్ తంటాలు పడుతున్నారు. పరిస్థితి చూస్తే పాక్ జట్టు ఓడిపోతుందని స్పష్టంగా తెలుస్తోంది. దీంతో ప్రేక్షకులు కోపం పట్టలేక రాళ్లవర్షం కురిపించారు. ఈ సంఘటనతో ఆటను రద్దుచేయక తప్పలేదు.

1997లో 'విల్స్' ఛాలెంజ్ ట్రోఫీలో సచిన్ టెండూల్కర్ నాయకత్వంలోని భారత జట్టు ప్రేక్షకుల ఆగ్రహానికి రెండవసారి గురైంది. భారత్-పాకిస్తాన్‌ల మధ్య వన్డేమ్యాచ్ సందర్భంగా ప్రేక్షకులు రాళ్లతో నీలేష్ కులకర్ణి, దేబాశిష్ మహంతి, అజయ్ జడేజా, వినోద్ కాంబ్లీలపై రాళ్లు రువ్వసాగారు. అయినప్పటికీ ఆటను కొనసాగించారు. 48వ ఓవర్‌లో గంగూలీకి బలంగా రాయి తగలడంతో సచిన్ జట్టు సభ్యులను తీసుకొని మైదానం వీడి పెవిలియన్‌కు వెళ్లిపోయాడు. శాంతింప జేయడానికి ప్రేక్షకుల దగ్గరకు వెళ్లాలని పాకిస్తాన్ కెప్టెన్ సయీద్ అన్వర్‌ను మ్యాచ్ రిఫరీ రాజన్ మధుగలే కోరారు. ఈ కోరికను అన్వర్ ఎందుకో నిరాకరించాడు. దీంతో పోలీసులు బలవంతంగా ప్రేక్షకులను బయటికి పంపించి మ్యాచ్‌ను కొనసాగించడం, భారత్ సిరీస్ గెలుచుకోవడం చకచకా జరిగిపోయాయి. 1989లో కరాచీ టెస్ట్‌లో భారత్ కెప్టెన్ శ్రీకాంత్‌పై ఒక ఉన్మాది దాడి చేసి చొక్కా చింపాడు. భారత జట్టు సహచరులు అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అందుకే కరాచీలో మన ఆటగాళ్లు ఆడేందుకు ఇష్టపడడం లేదు. ★

నిజమే నేనెవరిని ? ఈ మధ్య తప్పనిసరిగా వచ్చేస్తోంది మతిమరుపు. ఆ మరుపులో కచ్చితంగా నేను మరిచిపోయేది నా పేరునే. ఈ ప్రపంచంలో ఎవరు ఏమి మరిచిపోయినా తమని తాము మరచిపోరు కదా! కానీ నేను మరిచిపోతున్నాను. నాకు అప్పుడప్పుడు ఈ మతిమరుపు ఉన్న మాట వాస్తవమే కానీ మళ్ళీ నా పేరేమిటో నాకు తెల్సిపోతుండేది. కానీ ఈ ఆర్నెల్ల నుండి నా పేరేమిటో నేను పూర్తిగా మరచిపోయాను. అస్సలు గుర్తుకురావడం లేదు. బహుశా ఆ మధ్య ఏదో న్యాయసమ్మతమైన కోర్కెల పోరాటంలో పోలీసులు కొట్టిన లాఠీ దెబ్బలతో, కోర్టు ఇచ్చిన తీర్పులతో నా చిన్నమెదడు కాస్తా చిట్లిపోయినట్లుంది. అదిగో అప్పట్నించే అప్పుడప్పుడైనా గుర్తుకు వచ్చే నా దిక్కుమాలిన పేరును ఇప్పుడు పూర్తిగా మరిచిపోయాను. అయినా తెలుసుకోవాలి.

నేనెవరిని ?

శ్రీచరణ్ మిత్ర

నా గతంలోకి వెళితే మా అమ్మ "రా బాబూ బువ్వతిందువుగానీ' అని పిలిచినట్లు గుర్తొస్తుంది కానీ పేరేమిటో తెలియడం లేదు. స్కూల్ సర్టిఫికెట్‌లో నా పేరుండేది కానీ గుడిసె ఇంట్లో దాచుకున్న ఆ సర్టిఫికెట్స్‌ను గుడిసెతో సహా మొన్నే మత ఘర్షణల్లో తగలెట్టేశారు.

ఇప్పుడు నేను మిగిలాను కానీ పేరు లేకుండా పోయాను.

ఇది చాలా తీవ్రంగా ఆలోచించవలసిన విషయం అనిపించి, నా పేరును నేను తెలుసుకునే ప్రయత్నంలో పడ్డాను. ఈ పాతికేళ్ళ వయసులో నేనెవర్నో నాకు తెలియకపోవడం కన్నా దుర్భరం ఏముంటుంది? స్నేహితుల్నెవరినైనా అడుగుదామని తోచింది. నా నిరుద్యోగం, దారిద్ర్యం కారణంగా వారు నా కంటే ముందే నా పేరును మరిచిపోయారట. ప్చ్ ఏమిటో నేను స్నేహితులనైతే చాలా మందిని సంపాదించాను కాని సన్నిహితులను మాత్రం ఒక్కడ్నీ సంపాదించుకోలేకపోయాను.

ఆఁ సన్నిహితులంటే గుర్తుకు వచ్చింది. ఈ మధ్య కాలంలో నాలో దారిద్ర్యాన్ని-శరీరాన్ని సమంగా పంచుకున్న నా రెడీమేడ్ ప్రియురాలిని కలుసుకుంటే తెలియవచ్చేమో? తను కూడా ఈ మధ్య కలవడం మానేసింది. అయినా అవసరం నాది కనుక ఇంటి తలుపు తట్టాను.

విసుగ్గా తలుపు తెరిచిన ఆమె 'ఏమిటి?" అని అడిగింది.

"నేను నా పేరును మరచిపోయాను నేనెవరిని?" అని అడిగాను.

"పనీ పాటా లేని వాడికి పేరేమిటి ? ఊరేమిటి? నువ్వో నిరుద్యోగిని అంటుండేవాడివి. నాకదే గుర్తు" అందామె ముఖం మాడ్చుకుంటూ.

"అది కాదు నా పేరు?"

"ఏమో?... కాస్త పేరు ప్రతిష్టలు ఉన్నవారైతే కనీసం నా ఒళ్ళమ్ముకున్నందుకు వారి హోదాను బట్టి ఆ పేరు గుర్తుండిపోతుంది. కానీ, నీ పేరెవరు గుర్తుపెట్టుకుంటారు ? అదే లాయరు శంకరం బాబో, డాక్టరుశర్మ బాబో, సర్పంచ్ పోలయ్య బాబో, కంప్యూటర్ చంద్రబాబో అయితే గుర్తు పెట్టు కోవచ్చు నిన్నెలా గుర్తు పెట్టుకోమంటావు ?" అంది తలుపు దడాలున మూసేస్తూ.

నిజమే, నాకేముందని పావం ఆ అవమాయంకంరాలం గుర్తుపెట్టుకుంటుంది ? ఇంకెవర్ని అడగాలో తోచడం లేదు. అప్పటికే నేను బాగా అలిసిపోయినట్లుగా లేచి ఒక సిగరెట్ తాగాలనిపించింది. జేబులో ఉన్న సిగరెట్ తీసి వెలిగించాలనుకుంటుండగా జ్ఞాపకం వచ్చింది.

అవును... నేను తరచు సిగరెట్లు అప్పు తీసుకునే కిళ్ళీ వాడ్ని అడిగితే సరిపోతుంది. కానీ నేను వాడికి సిగరెట్లకు బాకీ పడ్డాను. అయినా ఫరవాలేదు. బాకీ తీర్చలేనందుకు నాలుగు తిట్లు తిట్టినా నేనెవరో వాడికి కచ్చితంగా గుర్తుండి ఉంటుంది.

ఎందుకంటే, ఈ ప్రపంచంలో ఎవరు ఎవరిని మరిచిపోయినా, బాకీ ఇచ్చిన అప్పుల వాడు మాత్రం తప్పక గుర్తు ఉంచుకుంటాడు.

ఆదరాబాదరాగా వాడి కిళ్లీబడ్డీ దగ్గరకు చేరాను.

నా అంచనా నిజమైంది. వాడు నన్ను గుర్తు పట్టి చిరునవ్వు నవ్వాడు.

"హమ్మయ్యా"... ఫరవాలేదు గుర్తుపట్టాడు.

శ్రీశ్రీ గారన్నట్టుగా 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు... నీ కోసమే కన్నీరు నించుటకు... నేనున్నానని' అన్న స్టయిల్‌లో కనీసం కస్టమర్‌గానైనా ప్రేమించడానికి, నేను అప్పు ఇన్ని రోజులుగా తీర్చలేదని కన్నీరు పెట్టుకోవడానికి ఈ కిళ్ళీ బడ్డీ వాడొకడు ఉన్నాడు. నాలాంటి వాడికి అదే భాగ్యమూ, అదే సర్వమూ.

"ఏమై పోయారండీ... కనిపించడం లేదు" అన్నాడు కృత్రిమంగానైనా నవ్వుతూ.

నా ఒళ్ళు పులకరించిపోయింది. ఆ ఆనందంలో వాడి దగ్గర మరో సిగరెట్టు తాగాలనుకుని జేబు తడుముకుంటుంటే, వాడే నా సిగరెట్టు తీసిచ్చాడు.

నేను మరీ ఆశ్చర్యపోతుంటే – "ఏమిటండీ అలా ఆశ్చర్యపోతున్నారు? మీ సిగరెట్ బ్రాండ్ నాకు తెలిసిందే కదా ?" అన్నాడు. ఆహ! నేను రెండు నిమిషాల్లో కాల్చిపారేసే సిగరెట్టు పేరునే గుర్తుపెట్టుకున్న వాడు నా పేరు గుర్తుపెట్టుకోడా?

ఆహః బాకికీ, బాకీదారుడికి మధ్య ఎంత గాఢమైన బంధం ఉంది?

అందుకే ఆ తిరుమలేశునికి అంతమంది బాకీదారులు ఉన్నారు. వాళ్ళని అందుకే ఆయన మరచిపోడు. బాకీ తీర్చమని సకల లీలలను ప్రదర్శిస్తాడు. అందుకే బాకీదారులంతా అతని భక్తులైపోతారు.

నేనూ ప్రస్తుతానికి, ఆ కిళ్ళీబడ్డీ వాడికి క్షణకాలం భక్తుడినైపోయాను. వాడి దివ్యమంగళ విగ్రహాన్ని తనివితీరా చూస్తూ, నే పడిన బాకీ నిమిత్తమై నా దగ్గర ఉన్న ఇరవై రూపాయలు వాడి గల్లా పెట్టె ముందు పెట్టి "నా పేరేమిటో నీకేమైనా గుర్తుందటోయ్" అన్నాను సాధ్యమైనంత గంభీరంగా.

వాడు గుంభనంగా నవ్వసాగేడు.

నేను వాడి వంక అయోమయంగా, ఇంకాస్త సస్పెన్స్‌గా "నేనెవరో నీకు గుర్తులేదా?" నీ బాకీ పుస్తకంలో నా పేరు రాసుకున్నావుగా" అన్నాను.

"రాసుకున్నాను గానీ... నాకు గుర్తు ఉండటం కోసం రాసుకున్నాను. మరి మరేం అనుకోరుగా" అన్నాడు కిళ్ళీకొట్టువాడు "ఏం అనుకోను ఫరవాలేదు చెప్పు?" అన్నాను

"అర్ధరూపాయి సిగరెట్టుగాడు అని రాసుకున్నానండి"

నాకు ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. గొంతు తడారిపోయినట్లుగా లేచి... "అది కాదు నా పేరు.." అంటూ నసగసాగేను.

"ఏమో మిమ్మల్ని అర్ధరూపాయి సిగరెట్టుగాడనే మేమందరం అనుకునే వారం" అని చెప్పాడు వాడు.

నిజం చెప్పొద్దు నాకు ఏడుపు ముంచుకు వచ్చింది.

నా స్థితినీ, నా లక్షణాన్ని గుర్తు పెట్టుకుని, నన్ను నిక్‌నేమ్ (మారుపేరు)తో గుర్తుపెట్టుకుంటున్న ఈ మాయదారి జనం నా పేరు గుర్తుపెట్టుకోనందుకు దుఃఖం పెల్లుబికింది. ఇక అక్కడ ఉండలేక, దగ్గరలో ఉన్న ఒక పార్కు వద్దకు వెళ్ళి, అక్కడ సిమెంట్ బెంచీ మీద కూర్చుని పైకి కనబడకుండా... దుఃఖంలో నేను కుమిలిపోతూ ఉండగా–

"ఏయ్... నువ్వెవరు?" అన్న కంఠం విని ఉలిక్కిపడి చూశాను. పోలీస్.

"నిన్నే ఎవరు నువ్వని అడుగుతున్నాను" అన్నాడా పోలీసు ప్రజాస్వామ్యబద్ధమైన ప్రశ్నార్థకపు చూపులతో. నాకు నవ్వొచ్చింది.

"నేను... నేను..."

"అదే నువ్వెవరో చెప్పి తగలడు.... తీవ్రవాదివా, ఉగ్రవాదివా, సోషలిస్టవా, కమ్యూనిస్టవా"

"నాకు తెలీదండీ... నాకు ఏ వాదమూ తెలీదు"

"తెలీదా? అయితే నువ్వెవడివయినా నాకు అవసరం లేదు. అదేమైనా తెలిసుంటే నువ్వు తప్పక కటకటాలు లెక్కపెట్టేవాడివి. ఆ గెడ్డం అదీ బాగా గీకించుకో లేదంటే ఉన్మాదివని మెంటల్ హాస్పిటల్‌లో తోసెయ్యగలరు" అంటూ ఉచిత సలహా ఒకటి పారేసి హడావిడిగా ముందుకు వెళ్ళిపోయాడు.

నేను ముఖం నిండుగా చేతులు కప్పుకుని ఆలోచిస్తుండగా ఆ పోలీసాయన మాటలు గుర్తుకు వచ్చాయి. 'నీకు ఏ వాదమూ తెలియకపోతే నువ్వెవడివైనా మాకు అవసరం లేదు.

అంటే మన ఉనికిని కాపాడుకోవాలంటే ఏదొక వాదం అవసరం అన్న మాట.

అందుకే కాబోలు అప్పుడప్పుడు పేపర్లలో రకరకాల వాదులు కనిపిస్తున్నారు.

'ఆధ్యాత్మికవాదులు, ప్రజాస్వామ్య వాదులు, స్త్రీ వాదులు, దళిత వాదులు, నాస్తిక వాదులు, ప్రజాతంత్ర వాదులు... అబ్బో... ఈ దేశంలో వాదులకేం కొదవలేదు" అని ఆలోచిస్తుండగా.

"ప్రజాస్వామ్య వాదులంతా సిద్ధం కండి" అంటూ మైక్‌లో అరుస్తూ ఓ గుంపు కనిపించింది. వెనకాల కరపత్రాలు పంచుతూ, నాలా వంటరిగా ఉన్న వాళ్ళతో ఏదో లాలూచీ పడుతున్నారు.

నేను వారిని ఆసక్తిగా గమనిస్తుండగా వారిలో ఒకడు నా దగ్గరకు వచ్చి 'విషయం' చెప్పాడు.

అతగాడెవరో ప్రఖ్యాత కులవాదిట. తమ కులానికి అధికార పార్టీ వారు ఇప్పటి దాకా మంత్రి పదవి ఇవ్వలేదని అతనికి సడన్‌గా ప్రజాస్వామ్యం గుర్తుకు వచ్చేసి... ఏకంగా ఒక పార్టీని స్థాపించి రాజకీయ రంగంలోకి ఉరికేశాడుట.

ఇప్పుడు అతన్ని బలవరిచి ప్రజా'స్వామ్యాన్ని' మేము కాపాడాలట. అందుకు ప్రజాస్వామిక వాదులంతా సిద్ధం కావాలంటూ జన సమీకరణ చేస్తున్నాడు.

అతగాడు చెప్పినదంతా విని –

"కానీ... నా పేరేంటో నాకు తెలీదు" అన్నాను. ఆ కులనాయక కార్యకర్తతో

"మాకు అవసరం లేదు.. కానీ మా నాయకుడికి అన్ని విషయాలు తెలుసు" అన్నాడు ఆ వ్యక్తి. మళ్ళీ నాలో ఆశ చిగురించింది.

"ఎలా తెలుస్తుంది? నన్ను నేను మరిచిపోతే"

నేను దారిద్ర్యరేఖకు ఎగువన వున్నానో, దిగువన ఉన్నానో తెలుసుకోవడానికి "నాకు రేషన్ కార్డే లేదు. అధికారులు ఇప్పటికీ ఆ విషయం కనుక్కోలేక నా రేషన్ కార్డు రాయడం మానేశారు" అన్నాను.

"పోనీ ఓటర్ల లిస్టులో చూద్దాం" మరింత ఓపికతో అన్నాడతను.

"దాంట్లో కూడా నా పేరు మీద మరెవరి ఫొటోనో పడిందని, నా పేరునే ఎగరగొట్టేశారు అందుకే ప్రస్తుతానికి నా పేరు నాకు తెలియడం లేదు" అని చెప్పాను.

"సరిగ్గా నీలాంటి వారే మా నాయకుడికి కావాలి. తానెవరో తనక తెలియని మనుష్యులంటేనే మా ప్రజాస్వామ్య నాయకుడికి చాలా ఇష్టం. ఆయనకు అన్నీ తెలుసు. నీవెవరో కూడా ఆయనకు బాగా తెలిసి ఉంటుంది. మాతో పాటు వచ్చెయ్" అంటూ తనతో పాటు తీసుకువెళ్ళిపోయాడు.

అప్పట్నించీ నేను పార్టీ జెండాలు కట్టాను. మీటింగ్‌లకు కర్రలు మోశాను. మా నాయకుడికి జిందాబాదులు సలాంలతో మైకుల్లో గొంతుపోయేలా అరిచాను.

మా నాయకుడి ఉనికి మొత్తం రాష్ట్రానికంతటికి తెలిసేలా, మా తోటివారితో నేనూ చాలా కష్టపడ్డాను. కానీ, నేనెవర్నో నాకు తెలియడం లేదు. తెలుసుకోవడానికి చాలాసార్లు మా నాయకుడితో మాట్లాడాలని ప్రయత్నించాను. కానీ... ఆయన చిరునవ్వుతో సమయం వచ్చినపుడు చెబుతాను అనేవాడు.

ఆ రీవీ, ఆయన మాటతీరు, ఆ దర్పం, ఆ హోదా అవన్నీ చూస్తే నేనెవరో ఆయనకు తప్పక తెలిసే ఉంటుందన్నది నా నమ్మకం.. నాకెంతగా నమ్మకం కుదిరిందంటే నేనెవర్నో నేను పూర్తిగా మరచిపోయినా... లేక జ్ఞాపకం రాకపోయినా ఆయనేం చెబితే అదే నేనుగా స్థిరపడిపోవాలన్నది నా ఆలోచన.

ఇలా రోజులు గడుస్తుండగా –

మా నాయకుడు ఎదురు చూస్తున్న ఎలక్షన్లు వచ్చాయి.

ఎడాపెడా హామీలు ఇచ్చేస్తున్నాడు, వాగ్దానాలు చేసేస్తున్నాడు. ఇచ్చిన హామీలు చిన్నచిన్నవి అయితే అప్పటికప్పుడు అమలు అయ్యేటట్టు ఆదేశాలు జారీ చేసేస్తున్నాడు.

అయితే నేనెవర్నో తెలియచెబుతానన్న వాగ్దానం కూడా చిన్నదే కనుక నేను ఆయనను అభ్యర్థించగా –

మా నాయకుడు శ్రీకృష్ణపరమాత్మలా

(మిగతా 15వ పేజీలో)



భారత్ వెలిగిపోతున్నది...

"ఏమిటలా మొఖం నేలకేశావ్?"

'ఎందుకలా అడుగుతున్నావు? వెనకటికి తన శిష్యుడు వెంకటేశాన్ని గిరీశం అడిగినట్టుగా!"

"నువ్వు తెల్లమొఖం పెట్టుకొని వచ్చావుగా... అందుకని అలా అడుగుతున్నాను.."

"తెల్లమొఖం వెయ్యక ఏం చెయ్యమంటావు?"

"నవ్వుతో వెలిగిపోయే మొహం వెయ్యి"

"అంత సీన్ లేదులే..."

"అంత సీన్ లేకపోవడమేమిటి ? మనల్ని ఏలుతున్న వాళ్ళు భారత్ వెలిగిపోతోంది అంటున్నారు కదా... భారత్ వెలిగిపోతున్నప్పుడు భారతీయులంతా వెలిగిపోవాలి గదా... దేశమంటే మట్టికాదు... మనుషులని గురజాడ వారు చెప్పారు కదా..."

"భారత్ వెలిగిపోతోందా?"

"వెలిగిపోతోందని టీవీ ఛానెల్లు, వార్తాపత్రికలు ఢంకా భజాయించి చెబుతున్నాయి గదా..."

"నేనిప్పుడే ఓ భయంకరమైన యాక్సిడెంట్ చూసొస్తున్నాను..."

"యాక్సిడెంటా? ఏం యాక్సిడెంట్?"

'లారీ యాక్సిడెంటా ? ఎంతమంది పోయారు?"

'ఎదురుగా వస్తున్న జీప్‌ను లారీ ఢీకొట్టింది. జీప్‌లో వున్న వారంతా చనిపోయారు. శవాలు రోడ్డు మీద చెల్లాచెదురుగా పడి వున్నాయి. చూస్తుంటే వళ్ళు జలదరిస్తోందనుకో? లారీ డ్రైవర్, క్లీనర్ కూడా చనిపోయారట? మొత్తం 20 మంది!

"ఎంత ఘోరం?"

"ఏముంది ? పాపం లారీ డ్రైవర్ డ్యూటీ ఎక్కి నెల రోజులైందట. అస్సాం వరకు వెళ్ళి సరుకులు దించి మళ్ళీ లోడ్‌తో వస్తున్నాడు. నెల రోజులుగా రెస్ట్ లేదుగా మరి. కళ్ళు మూతలు పడుంటాయి... జీప్ కూడా అంతే కొత్తగా కొన్నారట... కుర్రాడు ఇంకా పూర్తిగా నేర్చుకోలేదట... నిండా ప్యాసింజర్లను ఎక్కించుకుని వెళుతూ లారీని చూసి భయపడిపోయాడు. రెండూ ఢీకొన్నాయి. అంతే ఘోరం జరిగిపోయింది. 20 మంది అమాయకులు బలైపోయారు."

"లారీ డ్రైవర్లు ఇంత కష్టపడుతూ డ్యూటీలు చేస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి అంటూ అధికారులు ఒక స్టేట్‌మెంటిచ్చి ఊరుకుంటారు."

"వాళ్ళ బాధలు పట్టించుకునేదెవరు ?"

రోజూ ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నాయో లెక్కలేదు. ఎందరు చనిపోతున్నారో లెక్కలేదు... నిద్రలేవగానే పేపర్ మొఖం చూడాలంటేనే భయమేస్తోంది... ట్రెయిన్ యాక్సిడెంట్స్... బస్సు యాక్సిడెంట్స్... ఆత్మహత్యలు... పెళ్ళికూతుళ్ళ దహనాలు... పోలీస్ స్టేషన్లో మరణాలు... పోలీస్ ఎన్‌కౌంటర్లు... నక్సలైట్ల మందుపాతరలు... సహకార బ్యాంకులు దివాళా తీయడాలు... ఆ బ్యాంకుల్లో డబ్బు దాచుకున్న ఖాతాదార్ల లబోదిబోలు... నకిలీ స్టాంపుల కుంభకోణాలు... ఎన్నని చెప్పమంటావు... ఏమని చెప్పమంటావు?"

"అవును మరి... భారత్ వెలిగిపోతున్నది గదా...." "నిజమే. బాగా డబ్బున్న వాడు వెలిగిపోతున్నాడు... మొన్న నేను మా ఊరెళ్ళొచ్చాను.. అక్కడ చూసిన ఓ దృశ్యం నా హృదయాన్ని కలచివేసింది."

"ఏమిటో అది..."

"మా ఊరి వ్యవసాయ కూలీలందరూ మూటాముల్లె నెత్తికెత్తుకొని వేరే చోటికి వెళ్ళిపోతున్నారు.. కరువు కారణంగా వాళ్ళకు మా ఊర్లో ఏమీ పని దొరకడం లేదట... ఎక్కడో కాలవకింద పని దొరుకుతుందని కుటుంబాలకు కుటుంబాలు అక్కడికి తరలిపోతున్నారు..."

"పుట్టి పెరిగిన జన్మభూమిని వదిలేసి వెళ్ళిపోవడం ఎంత బాధాకరమో..."

"ఇంకో దృశ్యం గురించి చెబుతాను... మా ఊర్లోనే అప్పుల పాలైన ఓ మధ్యతరగతి కుటుంబం మొత్తం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఊరివాళ్ళందర్నీ కలచివేసింది..."

"చాలా మంది మధ్యతరగతి కుటుంబీకులు ఇలా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడం ఈ దేశంలో మామూలైపోయింది."

"చాలా మంది మధ్య తరగతి కుటుంబీకులు ఇలా అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకోవడం ఈ దేశంలో మామూలైపోయింది."

"అవును... గ్లోబలైజేషన్ పుణ్యమా అని ఇవ్వాళ మధ్యతరగతి కుటుంబీకులకు అప్పులు చాలా సులభంగా దొరుకుతున్నాయి. వినియోగ వస్తువుల్ని విరివిగా వాడే సంస్కృతి బాగా పెరిగిపోవడంతో ప్రతి కుటుంబీకుడు అప్పులు చేసి కార్లనూ, టీవీ సెట్లను, సి.డి. ప్లేయర్లనూ కొనిపారేస్తున్నాడు... ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు... వినియోగవస్తువులను అమ్ముకొని వ్యాపార సంస్థలు కోట్లు సంపాదిస్తున్నాయి."

"అవును... లాభాలు పెరిగిపోతున్నాయి. ఆత్మహత్యలూ పెరిగిపోతున్నాయి. తెల్గీలాంటి దళారులు వేల వేల కోట్లు సంపాదిస్తున్నారు. ఏవి నకిలీ స్టాంపులో, ఏవి అస్సలు స్టాంపులో, ఏవి నకిలీ నోట్లో, ఏవి అసలు నోట్లో ప్రజలు గుర్తించ లేకపోతున్నారు. భారత్ వెలిపోతున్నదంటే వెలిగిపోదుమరీ?..."

★

పుప్పాల కృష్ణమూర్తి

ఆటవిక న్యాయం

లక్కవరం ఊరి వెలుపల ఓ పెద్ద మర్రి చెట్టు వుంది. దాని కింద ఎప్పటినుంచో మైసమ్మ గుడి వుంది. చాలామంది ప్రజలు అక్కడ ప్రతి ఆదివారం తమ మొక్కులు చెల్లిస్తుంటారు. తమ తమ కుటుంబాలతో వచ్చి మేకనో, కోడినో దేవత ముందు కోసుకుని, తర్వాత ఆ మాంసంతో కూర వండుకుని తిని ఇంటికి పోతుంటారు. అలా కోసినప్పడు కోడైతే కాళ్లని, తలకాయనీ, మేకైతే ఒక కాలును గుడి ముందుకు వేలాడే చెట్టు కొమ్మకు కట్టేవారు.

అలా ఒక ఆదివారం ఆ మర్రి చెట్టుకు నాలుగు కోడి కాళ్లు, ఒక కోడి తల, రెండు మేక కాళ్లు వేలాడగట్టారు. మరునాటి ఉదయమే ఓ ఊర కుక్క ఆహారం వెతుక్కుంటూ అటుగా వచ్చింది. చెట్టుకు వేలాడుతున్న మాంసాన్ని చూసింది. "ఈ కాళ్లూ, తలకాయ నా నోటికి చిక్కితే ఇవాల్టికి ఆకలి సమస్య వుండదు" అనుకుని వెంటనే చెట్టు కిందకు చేరింది. కానీ దానికి వాటిని ఎలా అందుకోవాలో అర్థంకాలేదు. భూమికి ఐదడుగుల ఎత్తున అవి వేలాడుతున్నాయి. అది ఎగిరి అందుకుందామనుకుంది. కానీ దానికి అందలేదు. చెట్టు ఎక్కుదామని ప్రయత్నించి విఫలమయ్యింది. ఇంతలో దాన్ని చూసి ఓ కాకి ఎక్కడినుండో ఎగురుకుంటూ వచ్చింది. అది చెట్టు కొమ్మ మీద కూర్చొని 'కావ్... కావ్...' అని అరవసాగింది.

"ఏంటి? తెగ అరుస్తున్నావ్. ఈ మాంసాన్ని మొదట చూసింది నేను. దగ్గరకొచ్చావో ముందు నిన్ను తింటా.." అని బెదిరించింది కుక్క. దాంతో అది భయపడి వెళ్లిపోయింది.

ఆ కుక్క అలాగే చెట్టు కింద కూర్చుని, 'నాకు జిరాఫీలా ఇంత పొడవు మెడ వుంటే ఎంత బావుండేది. నోటితో అందుకుని తిందును గదా. ఏనుగులా తొండం వుంటే ఇంకా బావుండేది. కోతిలా చెట్టెక్కగలిగితే ఎంత బావుండునో..' అని పడుకొని పగటి కలలు కనసాగింది. చివరకు వేలాడగట్టిన తాళ్లకు శాపం పెట్టింది. కానీ అవేవీ తెగలేదు. అలా వాటిని చూస్తూ లొట్టలు వేస్తూ సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చేదాకా గడిపింది. కడుపులో ఆకలి దహించి వేస్తుంటే, ఇక వుండబట్టలేక ఊళ్లోకి పరిగెత్తింది.

కుక్క ఊళ్లోకి వెళ్లిపోగానే ఆహారం వెతుక్కుంటూ నక్క ఒకటి అటువైపే వచ్చింది. చెట్టుకింద కూర్చుని కలలు కనకుండా చుట్టూ ఓమారు పరిశీలించింది. ఎవరూ కనపడలేదు. కానీ కుక్క తరిమేసిన కాకి తిరిగి చెట్టు మీదకు వచ్చి నక్కను చూసి అరవసాగింది. వెంటనే నక్కకో ఉపాయం తట్టి, కాకిని దగ్గరకు పిలిచింది. దాని పిలుపు విని దగ్గరకు వెళ్లింది కాకి. అప్పడు నక్క, "నీకు రెక్కలున్నాయి కదా. నువ్వు తాడు విప్పెయ్యి. మాంసం చెరి సగం పంచుకుందాం" అంది.

కాకి గబాల్న కొమ్మల మీద ఎగిరి కూర్చుని, ముక్కుతో వేలాడగట్టిన తాళ్లన్నీ విప్పి కింద పడేసింది. నక్క అన్నింటినీ దగ్గరేసుకుని, కోడి తల మాత్రం కాకి ముందు పడేసి "ఇంద నీ వాటా. ఎంతైనా నాది జాలి గుండె కదూ?" అంది.

ఆ మాట, పంపకం చూసి కాకి నివ్వెరబోయింది. "ఇది అన్యాయం. మొదట చూసింది నేను. వాటిని చెట్టు మీదనుంచి కింద పడేసింది నేను. సగం వాటా పంచుకుందామని ఇలా ఒక ముక్క పడేయటం అన్యాయం" అంది కాకి జాలిగా.

అప్పడు నక్క, "మన అడవిలో బలవంతుడు చెప్పిందే న్యాయం. కుక్క ఈ చెట్టు కింద వున్నంత వరకూ నేనిటు రాలేకపోయాను. నువ్వు మాంసం దగ్గరకు రాలేకపోయావు. ఎందుకు? వాడు బలవంతుడు కావడం వల్లనే కదా. ఇప్పడు మొత్తం మాంసాన్ని నేనే తీసుకెళ్లినా నువ్వేం చేయలేవు. కనుక బలవంతుడు అవకారం చేయగలిగి వుండి కూడా చేయకపోవడమే గొప్ప మహోపకారం" అంది.

"నిజమే. అడవిలో ఆటవిక న్యాయం ఇలాగే వుంటుంది" అనుకుంటూ కోడి తలను నోట కరచుకుని మరో చెట్టు మీదకు ఎగిరిపోయింది కాకి.



ఏవి ఎన్ని చుక్కలు!



హాయ్ నేస్తాలూ... ఇవాళ మీ ముందుకు బోలెడన్ని నలుపు గడులు, చుక్కలు, తెలుపు చుక్కలు వచ్చాయి. రెండు తెలుపు గడులు కలిసే దగ్గర తెలుపు, నలుపు చుక్కలున్నాయి. కనిపించాయా! ఇప్పుడు మీరు చెయ్య వలసినదల్లా ఏవి ఎన్ని ? అనేది చెప్పడమే. అదేనర్రా! మీరు ఎంచక్కా కుదురుగా కూర్చుని నలుపు, తెలుపు చుక్కలు ఎన్ని వున్నాయో లెక్కపెట్టి చెప్పాలి. ఓకేనా? మరి గబక్కన చెప్పాలి. ఇంతసేపా? 'అబ్బా! మరీ అంత తొందర పెట్టకండి. ఇవతల మాకు చాలా తికమకగా వుంది. చూస్తున్న చుక్కేమో తెల్లగా వుంటోంది. మిగతావన్నీ నల్లగా వుంటున్నాయి. ఇదేం ప్రశ్నండీ బాబూ' అంటున్నారు కొందరు చిన్నారులు. కానీ మీకు ఓ రహస్యం చెప్పమంటారా? మీకు మాత్రమే చెప్తాం. ఓకేనా. అసలు అక్కడ వున్నవన్నీ తెలుపు చుక్కలే. నలుపు చుక్కలు లేనే లేవు. కాకపోతే మనం చూసే చుక్క మినహా మిగతావన్నీ నల్లగా కనిపిస్తాయంతే. తమాషాగా వుందికదూ.

మేజిక్! మేజిక్!!

చిన్నారి చిత్రకారులు

జి.వి.నాగరాజు, 9వ తరగతి, సి.కె.బోయ్స్ హైస్కూల్, మంగళగిరి, గుంటూరు.



టి.వినోద్‌కుమార్, 7వ తరగతి, న్యూ లిల్లీ మోడల్ హైస్కూల్, లల్లాగూడ, హైదరాబాదు.



ఎన్.సుందరరామయ్య, 8వ తరగతి, విశాఖపట్నం.



పి.రేష్మా చౌదరి, 7వ తరగతి, శివాని పబ్లిక్ స్కూల్, ఒంగోలు.

రంగులు అద్దుతారా!



క్విజ్-99

1. మాగ్మా అంటే ....?
   ఎ. కరిగిన లావా బి. గట్టిపడిన లావా
2. హాలీవుడ్ ఎక్కడ వుంది?
   ఎ. కాలిఫోర్నియా బి. న్యూయార్క్
3. రెక్కలు లేని పక్షి ఏది?
   ఎ.కివి బి. ఆస్ట్రిచ్
4. 'పండ్ల గంప'గా పేరుగాంచిన రాష్ట్రం?
   ఎ. హిమాచల్ ప్రదేశ్ బి. మధ్యప్రదేశ్
5. మన దేశంలో మొదటిసారిగా ఎప్పుడు జనాభా లెక్కలు చూశారు?
   ఎ. 1873 బి.1872
6. నిప్పు చేయడంకూడా తెలియని యుగం పేరేంటి?
   ఎ. నవీనయుగం బి. ప్రాచీన శిలాయుగం
7. మార్చి 14వ తేదీన ఎవరి వర్ధంతి జరుపుకుంటాం?
   ఎ. కారల్‌మార్క్స్ బి. స్టాలిన్
8. ఈ ఏడాది 11 ఆస్కార్ అవార్డులను పొందిన చిత్రం ?
   ఎ.లార్డ్ ఆఫ్ ది రింగ్స్
   బి.ది బార్బేరియన్ ఇన్‌వేజన్స్
9. 'వైట్ రెవల్యూషన్' అనగా...?
   ఎ. అధిక పాల ఉత్పత్తి
   బి. అధిక నీళ్ల ఉత్పత్తి
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ.టాడ్ ఫిలిప్స్
   బి.పీటర్ జాక్సన్

క్విజ్ 98కి జవాబులు

1.లండన్ 2. కులీకుతుబ్‌షా 3. బిలియర్డ్స్ 4. బోన్‌సాయ్ 5. న్యూయార్క్ 6. వస్తు మార్పిడి 7. తుఫాను 8. శంకరంబాడి సుందరాచార్య 9. సింహాలు 10. దిలీప్ టిర్కే

క్విజ్ 97కు సరైన సమాధానాలు రాసిన వారు :

పెంటకోట అమర్ జయసింహ, గవరపాలెం, అనకాపల్లి. **పాలెల్లి నరేష్‌కుమార్,** 9వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, చిలుకూరు, నల్గొండ. **టి.వి.బాలసుబ్రమణ్యం,** 4వతరగతి, బ్రాడీపేట, గుంటూరు. **వి. సుబ్బలక్ష్మి,** 7వ తరగతి, విజయనగరం. **జె.వెంకటేశ్వరరావు,** 6వ తరగతి, నల్గొండ. **పి.పాండురంగారావు,** 10వ తరగతి, మేడికొండూరు, గుంటూరు.

కలం స్నేహం

పేరు: యన్.కృష్ణ,
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : క్రికెట్ , వాలీబాల్ ఆడడం.
పూర్తిచిరునామా:యన్.కృష్ణ, సన్నాఫ్ యన్. బాలయ్య, నంది వనపర్తి, యాచారం, రంగారెడ్డి.

పేరు: జి.సి.ఉష,
వయసు : 11సం॥
చదువు : 6వ తరగతి
హాబీలు : కథలు చదవడం, ఆటలు ఆడడం, అన్నతో గొడవ పడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : జి.సి.ఉష, డాటరాఫ్ జి.సి.శరబణ్ణ, ఎన్‌టిఆర్ కాలనీ, ఎమ్మిగనూరు, కర్నూలు-518380.

హిరణ్యకుడి ఉపాయం

తన మిత్రులకు ఏమైందోనని మంధరుడు కంగారుగా వెతుక్కుంటూ బయలుదేరాడు. కాసేపటికే అందరూ కనిపించారు. అవన్నీ కలిసి మంధరుడిని కోప్పడ్డాయి. 'కాసేపు ఆగితే మేమే వచ్చేవాళ్లంకదా. నువ్వు బయలుదేరావెందుకు?' అని మందలించాయి. ఈ మాటలు అంటుండగానే వాటికి వేటగాడు కనిపించాడు. అతనిని చూడడంతోటే ఎలుక కలుగులో దూరింది. కాకి చెట్టు పైకి ఎక్కి కూర్చుంది. లేడి పొదలలోకి దూరింది. కానీ పాపం తాబేలు మాత్రం ఎటూ వెళ్లలేక అక్కడే వుండిపోయింది. వేటగాడు సంతోషంగా దాన్ని పట్టుకుని తాడుతో కర్రకు కట్టేసి భుజం మీద వేసుకుని ముందుకు సాగాడు. లేడి తప్పించుకున్నా తాబేలు దక్కినందుకు సంతోషించాడు.

హిరణ్యకుడు, లఘుపతనకుడు, చిత్రాంగుడు మళ్లీ ఒకచోటికి చేరారు. 'ఇదేంటి మిత్రమా! ఒక ఆపదనుంచి బయట పడ్డామనుకుని సంతోషించాం. ఇంతలోనే మరో కష్టం వచ్చి పడింది. అయినా మనం ఏ మాత్రం దిగులుపడకుండా వేటగాడు అడవిని దాటకముందే మంధరుడిని కాపాడుకోవాలి. ఏదైనా ఉపాయం ఆలోచించండి' అన్నాడు హిరణ్యకుడు.

పంచతంత్ర కథలు



అప్పుడు హిరణ్యకుడు ఒక ఉపాయం ఆలోచించాడు. 'చిత్రాంగా! నువ్వు వేటగాడి కంటపడకుండా వేగంగా ముందుకుపోయి వేటగాడు వెళ్లే మార్గంలో కోనేరు దగ్గర చనిపోయినట్టు పడివుండు. కాకి నీ మీద కూర్చుని పొడుచుకు తింటున్నట్టు నటిస్తుంది. అప్పుడు వేటగాడు నువ్వు నిజంగానే చనిపోయావనుకుంటాడు. మంధరుడిని కట్టివేసిన కర్రను కిందకు దించుతాడు. అప్పుడు నేను వచ్చి తాడు కొరికి విడిపిస్తాను. మంధరుడు కోనేటిలోకి వెళ్లి తప్పించుకుంటాడు. నేను ఏదో ఒక కన్నంలో దూరతాను. ఇది నా ఉపాయం' అంది. అందరూ 'భలే భలే' అన్నారు. హిరణ్యకుడు చెప్పినట్టు చేశారు.

కోనేటి దగ్గర చచ్చినట్టు పడివున్న లేడిని చూసి వేటగాడు భుజం మీది కర్రను కిందపెట్టాడు. వెంటనే హిరణ్యకుడు వెళ్లి తాడు కొరికాడు. మంధరుడివైపు చూసి 'కోనేటిలోకి పారిపో' అని చెప్పి కన్నంలోకి దూరాడు. వేటగాడు దగ్గరకు వస్తుండగానే లఘుపతనకుడు 'కావు కావు' అంటూ వెళ్లిపోయాడు. ఆ అరుపుకు లేడి వేగంగా పరిగెత్తుకుంటూ వెళ్లిపోయింది. ఇదంతా చూసి వేటగాడు ఆశ్చర్యపోయాడు. ఏమీ చేయలేక ఇంటి ముఖం పట్టాడు. తర్వాత నలుగురు స్నేహితులు ... తమకు ఎదురైన కష్టనష్టాలను పంచుకుంటూ కాలం గడపసాగారు.

విష్ణుశర్మ రాకుమారులకు ఈ కథ అంతా చెప్పి చివరకు ఇలా అన్నాడు. 'చెడ్డవారితో స్నేహం చాలా తొందరగా దొరుకుతుంది. అంతే తొందరగా పోతుంది. కానీ మంచి స్నేహం అంత సులువుగా దొరకదు. మంచి స్నేహాన్ని సంపాదించడం కష్టమైనా ఆ స్నేహం ఎప్పటికీ చెడిపోదు. మీరు ఇంతవరకు తెలుసుకున్న కాకి, ఎలుక, తాబేలు, లేడి కథ అందుకు ఉదాహరణ. అందుకని మీరుకూడా మంచి స్నేహితులను సంపాదించుకోండి. ఒకరికొకరు సాయపడుతూ సుఖంగా జీవించవచ్చు' అన్నాడు.

(వచ్చేవారం నుంచి మిత్రభేదం కథలు ఇస్తాం. మరి ఎదురుచూస్తారుగా)

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

చుట్టూ మంచు పర్వతాలు...

తెల్లని హిమపాతాలు.. లోయలు, గుట్టలు... కొండలు... ఎముకలు కొరికే చలి... మంచువర్షం నిరవధికంగా కురుస్తోంది.

రెండురోజులుగా సూర్యకిరణాలు కనిపించడం లేదు.

తుపాన్‌లో ఆకాశం మాదిరి... నీలం రంగు ఎక్కడా కనిపించడం లేదు. వెలుతురు తగ్గిపోతుంటే రాత్రి తరుముకు వస్తోందని అర్థం అవుతోంది.

సంతోష్ యాదవ్‌కు నిస్సత్తువగా ఉంది.

పర్వతారోహణ ఎంతో ఆసక్తి కలిగిస్తున్నా చలిలో శరీరం సహకరించడం లేదు. అయినా పట్టుదల... సాధించి తీరాలన్న దృఢ సంకల్పం ధైర్యాన్ని కలిగిస్తోంది.



ఎదిగిన ఎవరెస్ట్ శిఖరం

హిమాలయ పర్వత సముదాయంలో 'మౌంటు వైట్ నీడిల్' పర్వతం ప్రశాంతంగా నిద్రిస్తున్న ఏనుగులా ఉంది. తొమ్మిది దేశాల నుంచి వచ్చిన 31 మంది ప్రతినిధులు గుడారాలు వేసుకుంటున్నారు.

వారిని దీక్షగా చూస్తోంది సంతోష్ యాదవ్.

పర్వతారోహణకు బయలుదేరిన ఆ బృందంలో ఏకైక మహిళగా ఆమె పాల్గొంది. మగవాళ్ళతో ఎందుకు అని తల్లిదండ్రులు అభ్యంతర పెట్టారు. ఆమె సంకల్పం ముందు తలవంచారు.

బృందంలో సభ్యురాలిగా చేరి బయలుదేరింది.

"సంతోష్! నీకోసం ఈటెంటు ప్రత్యేకంగా వేయించాను. రాత్రి విశ్రాంతి తీసుకుని ఉదయాన్నే బయలుదేరాలి." తమ కెప్టెన్ శివసాగర్ దగ్గరికి వచ్చి చెప్పాడు.

"కాస్త నీరసంగా ఉంది!"

"నీరసం ఉండకూడదు. నిరుత్సాహాన్ని నువ్వు జయించాలి. ఇంకా మనం తొలి అడుగులోనే ఉన్నాం... ఇంకా 21,653 అడుగులు వేయాలి. మరేం ఫర్వాలేదు అందరం నీ చుట్టూనే ఉన్నాం!" సాగర్ చెప్పిన ధైర్యంతో ముందుకు కదిలింది.

తన కోసం ఏర్పాటు చేసిన గుడారంలోకి వెళ్ళింది.

నడుముకు వేలాడుతున్న బరువును పక్కన పెట్టి మిలటరీ పరుపులో దూరి తాళ్ళు బిగించుకుంది.

క్రమంగా ఆలోచనల్లోకి జారిపోయింది.

దూరంగా తమ సహచరులు ఉత్సాహం కోసం పాడుకుంటున్న బృందగీతాలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి. చలిని పారద్రోలడానికి వెలిగించిన నెగడు తాలూకు వెలుగునీడలు గుడారంపై కనిపిస్తున్నాయి. గాలిలా మంచు వీస్తున్న చప్పుడు హృదయంలో స్పందనలు రేపుతోంది.

ఆలోచనల్లో ఆమెకు భవిష్యత్ కనిపిస్తోంది.

పర్వతారోహణలో అందరి విజయాలను అధిగమించాలి. అన్ని శిఖరాలతో పాటు ఎవరెస్టును కూడా ఎక్కాలి. భారతదేశ మహిళగా కీర్తి కిరీటాన్ని తాను పొందాలి. అందరి ప్రశంసలూ పొందాలి' అనుకుంది.

సంతోష్ యాదవ్ పట్టుదల శిఖరాలను ఎక్కే మహిళగా గుర్తింపు పొందాలనేది. అందుకోసమే ఆమె తన కృషిని ప్రారంభించింది. ఇందులో అందరికన్నా భిన్నంగా గుర్తింపు పొందాలి. విభిన్నంగా పేరు సంపాదించాలి.

ఆలోచనల్లో ఎప్పుడు నిద్రలోకి జారిపోయిందో తెలియలేదు.

* * *

1989లో సంతోష్ యాదవ్ పర్వతారోహణలో వేసిన మొదటి అడుగు తర్వాత మరి వెనక్కి తిరిగి చూడలేదు. అడుగులో అడుగు వేస్తూ పర్వతారోహణే మహాప్రస్థానంగా ముందుకు సాగిపోయింది.

'మౌంట్ వైట్ నీడిల్' పర్వతాన్ని దిగ్విజయంగా అధిరోహించిన ఏడాది తర్వాత మరో అవకాశం ఆమెను వెతుక్కుని వచ్చింది. 25,170 అడుగులున్న 'ససేజ్ కాంగ్రి' శిఖరాన్ని ఎక్కడానికి ఎంపిక చేయబడిన 'ఇండో-తైవాన్' బృందంలో భారతదేశ ప్రతినిధిగా సభ్యత్వం లభించింది. ఆ బృందంతో ఆ పర్వతాన్ని అంచులు చూసింది. ఆ తర్వాత 1991లో ఇండో జపనీస్ బృంద సభ్యురాలిగా కాంచనజంగ శిఖరంపై అడుగు పెట్టింది.

ఆమె ప్రతిభను గుర్తించి ఇండో టిబెటన్ పోలీస్ ఫోర్సులో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ అవకాశం లభించింది. ఉద్యోగంలో చేరిన తర్వాత హర్యానా రాష్ట్రంలో రేహరి జిల్లాలోని తన స్వగ్రామం తైనాకు చేరుకుంది.

తండ్రి ఆశీస్సులు తీసుకుంది.

"అమ్మా!.. నీ అభీష్టాన్ని ఏనాడూ కాదనలేదు. నువ్వు జైపూర్‌లో బి.ఏ. చదువుతున్నప్పుడు ఆరావళి పర్వతాలు ఆకర్షించాయి. ఫ్రెండ్సుతో చూడటానికి వెళతానని ఉత్తరం రాస్తే వెయ్యి రూపాయలు పంపాను. ఉత్తర కాశీలో పర్వతారోహణ కోర్సు చేస్తానని నువ్వు పట్టు పట్టినప్పుడు ఆ కోర్సుకు ఎటువంటి ఉద్యోగావకాశాలు లేవని తెలిసినా ఒప్పుకున్నాను. అందులో 'ఏ' గ్రేడ్ సాధించి అడ్వాన్సుడు కోర్సులో చేరినా అభ్యంతర పెట్టలేదు... తండ్రిగా నీ అభిరుచులు గౌరవించాను.. నువ్వు అభివృద్ధి చెందితే ఆనందించేవారిలో మొదటివాడిని... ఈనాడు పోలీసు ఫోర్సులో ఉద్యోగాన్ని పొందావు... నీ విజయాలను నువ్వే వెతుక్కున్నావు..." ప్రతాప రాణా ఒక్కొక్కమాట కూడబలుక్కుని చెప్పారు. కూతుర్ని దగ్గరకు తీసుకున్నారు.

సంతోష్ యాదవ్‌కు మాటలు రాలేదు.

"నాన్నా! నేను వేసే ప్రతి అడుగు వెనుకా నువ్వు ఉన్నావు.. నా ఇష్టాల్ని ఏనాడూ అడ్డు చెప్పలేదు. నీలాంటి తండ్రి ఉంటే ఆడపిల్లలంతా ఏమైనా సాధించగలరు!" గద్గద స్వరంతో చెప్పింది.

"అనుకున్నవన్నీ సాధించావు కదమ్మా!"

"లేదు నాన్నా! ఉద్యోగం వస్తే నా కృషికి ఫుల్‌స్టాప్ పెట్టినట్లు కాదు. ఇప్పటి నుంచే నా కృషి మళ్ళీ మొదలవుతుంది!"

"అంటే?" ప్రతాప్ రాణా ఆశ్చర్యంగా ప్రశ్నించారు.

"ఎవరెస్టు శిఖరాన్ని చిన్నవయస్సులో అధిరోహించాలి. అదీ ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు... నా చేతులతో మన దేశ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలి... ప్రపంచ రికార్డు సాధించాలి... అదే నా లక్ష్యం... ఆశయం..." సంతోష్ యాదవ్ దృఢంగా

చెప్పింది.

ప్రతాప్ రాణా కళ్ళల్లో ఆనంద భాష్పాలు....

"గాడ్ బ్లెస్ యూ!" ఆశీర్వదించాడు.

* * *

సంతోష్ యాదవ్ ఎదురు చూస్తున్న అవకాశం 1992లో వచ్చింది. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి బయలుదేరింది. దారి పొడుగునా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని, వాతావరణాన్ని తట్టుకుంటూ మొక్కవోని ధైర్యంతో పైపైకి దూసుకుపోయింది. ఈ యాత్రలో 26 వేల అడుగుల ఎత్తు వరకూ తన మొత్తం కిట్టును తానే మోసుకుని వెళ్ళింది. ఆక్సిజన్ సిలెండరు కూడా శిఖరాగ్రం వరకూ తనే తీసుకు వెళ్ళింది.

1992 మే 12న ఎవరెస్ట్ మీద మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఎగురవేసి సంతృప్తిగా నిట్టూర్చింది. అప్పటికి అతి చిన్నవయస్సులో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన మహిళగా రికార్డు సృష్టించింది.

ఆ మరుసటి సంవత్సరం 1993 మే 2న మరోసారి ఎవరెస్ట్‌ను ఎక్కింది. ఏడాది కాలంలో రెండుసార్లు శిఖరాన్ని అధిరోహించిన ఘనత సంతోష్ యాదవ్ సొంతం చేసుకుంది.

లిమ్కా రికార్డుల్లో పేరు నమోదైంది.

ఆ తర్వాత ఆమె వెనక్కి తిరిగి చూడలేదు.

1995లో జపాన్‌లో అతి ఎత్తయిన ఫ్యూజియామా పర్వతాన్ని, 1998లో అర్జెంటీనాలో ఉన్న ఆండీస్ పర్వతశ్రేణిలో అకాంకాగ్వా శిఖరాన్ని ఎక్కి ఆ దేశాల్లో కూడా భారతదేశ కీర్తి ప్రతిష్ఠల్ని ఇనుమడింప చేసింది. 1999లో 'మిలీనియం ఇండియన్ ఎవరెస్ట్' బృందానికి ఆమెను నాయకురాలిగా భారత ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ బృందం సభ్యులతో కాంగ్‌షంగ్ రూటులో యాత్రను విజయవంతంగా నిర్వహించగలిగింది.

* * *

'పర్వతారోహణ శిక్షణా కళాశాల'

పసుపుపచ్చని అక్షరాలతో అందంగా రాసిన చెక్కబోర్డు ఆ గది ముందు తగిలించి ఉంది. చుట్టూ పచ్చని తోటలు ఫార్మ్‌హౌస్ మాదిరిగా ఉన్న ఆ ప్రాంతంలో ఆ కళాశాల కొత్తగా వెలసింది.

మహిళా శిరోమణి, రాజీవ్‌గాంధీ అవార్డు, భారత్ గౌరవ్ అవార్డులతో పాటు భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే పద్మశ్రీ అవార్డులను పొందిన సంతోష్ యాదవ్ ఆ కళాశాల నిర్వాహకురాలు.

వీల్ ఛైర్... ఎదురుగా విశాలమైన టేబుల్... ఎదురుగా ఆరు కుర్చీలు... అందంగా అలంకరించబడిన ఆఫీసు రూం.. చూసే వారికి ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

"నాన్న వస్తారా?" అప్పటికి పదిసార్లకు పైగా అనుకుంది సంతోష్ యాదవ్. కొత్త అవతారం ఎత్తిన విషయాన్ని వివరిస్తూ ఒకసారి రమ్మని తండ్రి ప్రతాప్ రాణాకు రాసిన ఉత్తరం అందిందా అని ఆమె సందేహపడింది.

ఆలోచనలతో ఒక్కతే కూర్చుంది వంటరిగా.

దూరంగా తండ్రి ప్రతాప్‌ను గుర్తించి కుర్చీలోంచి వేచి ఎదురు వెళ్ళి తోడ్కొని వచ్చి ఆఫీసు రూమును చూపించింది.

అంతా అయిన తర్వాత ఆయన కుర్చీలో కూర్చున్నారు.

"నాన్నా! ఇక్కడ పర్వతారోహణ పట్ల ఆసక్తి ఉన్న వారికి ఈ నమూనాలు ఎంతగానో ఉపయోగపడుతోంది. నేపాల్ నుంచి కైలాస్ పర్వతానికి, మానస సరోవరానికి, ముక్తినాథ్‌కు యాత్రికులను తీసుకువెళ్ళి తీసుకువచ్చే కార్యక్రమాన్ని చేపట్టాను. నీ ఆశీర్వాదం కావాలి..." సంతోష్ యాదవ్ అభ్యర్థించింది.

"అమ్మా! నీ అభ్యర్థన ఏనాడూ కాదనను. నీ ఇష్ట ప్రకారం చేయవచ్చు. అన్నింటికీ నీ విజ్ఞత ఉండనే ఉంది-" ప్రతాప్ రాణా అనునయించారు.

ఆఫీసుబాయి టీ తీసుకు వచ్చి టేబుల్‌పై పెట్టాడు.

"సంతోష్! నీ ఉద్యోగం..." టీ కప్పు తీసుకుంటు అర్ధాంతరంగా ఆగిపోయాడు ప్రతాప్.

సంతోష్ యాదవ్ ఏమీ మాట్లాడలేదు.

రెండు నిమిషాల తర్వాత... "క్షమించు నాన్నా! పర్వాతారోహణ నాకెంత ఇష్టమో తెలుసు. నన్ను ప్రోత్సహించడానికి నువ్వు ఉన్నావు. కానీ నాలాంటి వారిని ప్రోత్సహించడానికి, చేయూత నివ్వడానికి ఎవరైనా ఉంటారేమో నాకు తెలియదు. కానీ అటువంటి వారికి నేను అండగా ఉండాలని ఈ సంస్థను స్థాపించాను. ఈ బృహత్కార్యానికి నా ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం అడ్డంకిగా భావించాను. అందుకే దానికి గుడ్‌బై చెప్పాను. నా నిర్ణయం మంచిదో కాదో నాకు తెలియదు. కాని నా మనస్సాక్షికి నచ్చిన విధంగా చేశాను.." ఒక్కొక్క మాట చెబుతూ ఆమె తండ్రి కళ్ళల్లోకి చూసింది.

ప్రతాప్ రాణా ఏం సమాధానం చెబుతాడో అని సంతోష్ యాదవ్ ఎదురు చూసింది. నాన్న నోటి నుంచి ఏ మాట వినవలసి వస్తుందోనని ఒకింత ఆందోళన చెందింది.

రాణా కూతురు దగ్గరికి వచ్చి తలమీద చేతితో నిమిరి... "ఎవరెస్టు ఎక్కిన తర్వాత నీ వ్యక్తిత్వం ఎవరెస్టు అంత ఎత్తుకు ఎదిగిపోయిందమ్మా! గాడ్ బ్లెస్ యూ!" అన్నాడు.

తండ్రి ఆప్యాయతకు సంతోష్ యాదవ్ కళ్ళు వెచ్చటి నీటితో చిప్పిల్లాయి. ★

నేనెవరిని ?

(9వ పేజీ తరువాయి)

చిరునవ్వుతో -"నీలాంటి సందేహం ఉన్న వారందర్నీ రమ్మని చెప్పాను. నా దగ్గర ఉన్న వారంతా అలాంటి వారే కనుక అందరికీ ఒకసారే చెబుతాను" అంటుండగా బిలబిలమంటూ నా సహచరులంతా లోపలికి ప్రవేశించారు.

విచిత్రం... వాళ్ళంతా తామెవరో మరచిపోయిన వారేనట. వాళ్ళంతా తామెవరో తెలుసుకోవడానికే ఇంతకాలం ఇక్కడ ఉన్నారట.

నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తుండగా-

ఆ ప్రజాస్వామిక నాయకుడు, ఆ పరమాత్మ స్వరూపుడు కాబోయే ఆ ప్రభుత్వ నాయకుడు ఇలా చెప్పడం మొదలు పెట్టాడు.

"నాయనలారా! మీరెవరో తెలుసుకొనే ముందు నేనెవరో తెలుసుకొనే ప్రయత్నం చేయండి. తెలుసుకోండి. మీ కోసం రోజుకొకసారి ప్రతి మీటింగులోనూ నా తుది శ్వాస వరకూ మీ కోసం శ్రమిస్తామని చెబుతూ, నా ప్రతి చివరి రక్తం బొట్టు ఈ దేశానికే అంకితం చేస్తూ... మళ్ళీ... మళ్ళీ... మీ కోసం పునర్జీవితం పొందుతున్న నన్ను తెలుసుకోకుండా మీరెవరో మీకు ఎలా తెలుస్తుంది.

అయినా చెబుతున్నాను. మీరు మేం తయారు చేసుకున్న ఓటర్లు. మీరు ఏమిటో... ఏం చేస్తున్నారో.. ఎలా ఉన్నారో మేం గమనిస్తున్నా, పరమాత్మకు ఆత్మలన్నీ సమానమన్నట్టుగా మీరు ఎవరైనా మా దృష్టిలో కేవలం ఓటర్లుగానే చూస్తున్నాం. భగవంతుడికి వేయి రూపాలు అన్నట్టు తరతరాలుగా మేం పాలకులం అయి మిమ్మల్ని బానిసలుగా, సేవకులుగా, ప్రస్తుతం ఓటర్లుగా భావిస్తూ మీ జన్మలను పునీతం చేస్తున్నాం.

మీరు ఆకలి చావులతో అల్లాడుతున్నా, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా, నిరుద్యోగంతో నిరంతరం ఛస్తున్నా, పన్నులు కట్టలేక అవస్థలు పడుతున్నా, పంటలు పండగ పస్తులు ఉంటున్నా, దారిద్ర్యరేఖకు దిగువకు క్రమంగా ఇంకా దిగబడి పోతున్నా... మీరు ఉన్నారంటూ అయిదేళ్ళకొకసారి ఓటరుగా మీకు గుర్తింపునిస్తూ ఈ దేశంలో మీ ఉనికి ఉదారంగా చాటుతున్నాం.

మీరు ఏకులం వారైనా, ఏ మతం వారైనా, ధనికులైనా, మీ ఖర్మకొద్దీ దరిద్రులైనా, నిరుద్యోగులైనా, యాచకులైనా, వికలాంగులైనా మీరు ఎవరైనా మీరు మాత్రం ఓటర్లు అని మరచిపోవద్దు.

మీ రంగు, రూపం, వృత్తి, ప్రవృత్తి ఏదైనా సరే మీరు ఓటర్లు మాత్రమే. మీరు అలా ఉండటమే మాకిష్టం మీకంటూ ఏదీ ఉండకూడదు. కోరికలు అంటూ ఏమీ పెట్టుకోకూడదు. సర్వకాల, సర్వావస్థల యందూ మా ప్రతినిధులు చెప్పినట్లు విని, మేం చేసే సమావేశ, కార్యాలకు హాజరై, మా ఆజ్ఞలను తప్పక పాటించడమే మీ ధర్మం. ఆ ధర్మాన్ని అతిక్రమించినచో - మా పరిపాలనలో మా ఓటర్లు అనే కనికరం మరచి, సామూహిక నిర్బంధాలు చేయించగలం. మా లీలా వినోదంలో భాగంగా బాష్పవాయువులు ప్రయోగించగలం, కాల్పులు జరిపించి, గుర్రాలతో సైతం తొక్కించి చూపించగలం. కనుక గుర్తింపు పొందిన ఓ ఓటర్లారా రాజ్యాంగ హక్కులు అనబడే సైతాను మాయలో పడి... మిమ్మల్ని మీరు తెలుసుకునే ప్రయత్నం చేయకండి. ఒకవేళ చేసినా...

''అన్యధా శరణం నాస్తి... త్వమేవ శరణం మమ" అని మమ్మల్ని వేడుకుని, ఓటరుగా మీ జీవితాల్ని సార్థకం చేసుకోండి'' అంటూ ముగించాడు.



హమ్మయ్యా... ఇప్పుడు నేనెవరో నాకు తెలిసిపోయింది.

వీ ం క ా తెలిసిపోయి ఉంటుంది కదా!

నేను 'ఓటర్ని' అని. ★

కలవరింతలు..

లక్ష్మి

ఒకావిడ డాక్టరు దగ్గరికి వెళ్ళిందట!

సుస్తీ ఏమిటో చెప్పమని అడిగేట్ట డాక్టరు!

"మాయదారి రోగం నాక్కాదు డాక్టరు గారూ! మా ఆయనకొచ్చింది! రాత్రిళ్ళు నిద్రలో తెగ కలవరిస్తుంటారు. ఆయన కలవరింతల్తో నిద్రపట్టక ఛస్తున్నానంటే నమ్మండి!"

"అంతేకదా? మందులు రాస్తాను పట్టుకెళ్ళండి. వారం రోజులు శ్రద్ధగా వాడమనండి? ఆ తర్వాత ఎంత గింజుకున్నా కలవరింతలు రానేరావు!"

"వద్దొద్దు! కలవరింతలు రాకుండా మందిస్తే నా గతేంగాను? ఆయన కలవరిస్తూనే వుండాలి. కాకపోతే - కాస్త స్పష్టంగా... మాట తెలిసేలా కలవరించడానికి మందిచ్చి పుణ్యం కట్టుకోండి! మా ఆయన కలలో కనిపించే ఆ సుందరాంగి పేరేమిటో తెలిసి చావడం లేదు!"

నిజమేమరి!

ఇలాంటప్పుడే సదరు అర్ధాంగికి వళ్ళు మండిపోతుంది!

భర్త మహాశయుడు తన కలవరింతల్లో కథ మొత్తం స్పష్టంగా వినిపించి - సుందరాంగి అడ్రస్సు మాత్రం అర్థం గాకుండా కలవరిస్తే ఏ భార్య మాత్రం ఓర్చుకుంటుంది?

మగాళ్ళింతే!

కలల్లో కూడా కథని గుట్టుగా నడిపిస్తారు!

కలవరించినా కథ అర్థం కాని దిక్కుమాలిన పరిస్థితుల్లో - మనసులో అనుకునే మాటలు - స్వగతాలు ఎట్లా తెలుస్తాయి?

మనిషి మౌనంగా వున్నంత మాత్రాన - అతని మనసు కూడా మూగనోము పట్టిందని చెప్పడానికి వీల్లేదు. అనువైన మాటలే మాటాడి - అనువుగాని మాటల్ని మనసులో అనేసుకుంటారు!

ఈ రెండు ఫీట్లూ ఏకకాలంలో జరిపించేయడం మగాళ్ళ ప్రత్యేకత!

వంట చెత్తగా వుందని మనసులో అనుకుంటూనే - అద్భుతంగా చేసేవు అన్నపూర్ణా అని అంటారు!

అమ్మో - ఈ మగాళ్ళ ట్రిక్కులనేకం!

సిటీబస్సులో బుద్ధిగా కూచున్న బుద్ధావతారాన్ని చూసి బహుగొప్ప బుద్ధిమంతుడని అనుకోడానికి వీల్లేదు!

రద్దీగా వున్న ఆ బస్సులో నిలబడి ప్రయాణం చేస్తున్న అందమైన అమ్మాయిని ఆబగా చూస్తాడు. మనసులో ఆ అమ్మాయికి 'ముద్దబంతిపూవు' అని పేరెట్టుకుంటాడు!

బస్సు కుదుపులకు ముద్దబంతిపూవు తూలిపడబోతూ నిలబడుతున్న ప్రతీసారి పాపిష్టి కోర్కెలను కోరుకుంటాడు!

ఆ కోర్కెలన్నిటినీ గుట్టుగానే మనసులో దాచుకుంటాడు. వాటిని వెల్లడిస్తే బస్సులో వున్న ఆడవాళ్ళు యావన్మందీ ఆ బుద్ధుడికి బడిత పూజ చేస్తారని తెలుసు!

అందుకే గుట్టుగా వుండి బతికిపోతున్నాడు!

మనసులో -

లింకుల్లేకుండా అనేక విషయాలు తనకి తానే చెప్పుకునే విన్యాసానికి ఇంగ్లీషు వాడు స్ట్రీమాఫ్ కాన్షియస్‌నెస్ అని పేరు పెట్టేడు. తెలుగులో చైతన్యస్రవంతి అని అనువదించుకోవచ్చు!

ముతకగా చెప్పాలంటే - స్వయంపాకం అంటే సరిపోతుంది. దాదాపు కలవరింతటైపే గాని - కలగూరగంపు టైపులో వుంటుంది. మగాళ్ళకు ఈ విన్యాసమ్మీద ఇంటరెస్టెక్కువ. కూరలు కొనేందుకు ఇంటి నుంచి కాలు బయటపెడతాడు!

మౌనంగా నడవలేదు. మనసురొద చేస్తుంది. ఆనోది సింపులుగా ఇట్లా వుంటుంది -

ధరలు మండిపోతున్నాయి. సంచులతో డబ్బులు పోసి జేబులో కూరలు తెచ్చుకునే దిక్కుమాలిన రోజులు! రోడ్డు గలీజుగా వుంది. టమోటా బెటరు. చవగ్గా దొరకొచ్చు!

మునిసిపాలిటీ నిద్రపోతోంది. టాక్సులు వసూలు చేసేప్పుడు మాత్రం మేలుకుని రెట్టింపు గుంజుకుంటుంది. గుత్తి వంకాయ్ కూరోయ్ బావాపాటెంతో బావుంటుంది. ఆ కూర అమ్మ బ్రహ్మాండంగా చేస్తుంది! డెబ్బయి అయిదేళ్ళు. మంచమెక్కి నాలుగేళ్లు. దోసకాయ చిన్నాడికి ఫేవరేట్. వాడి క్లాసుమేట్‌కి ఆ పేరే పెట్టేడని ఆ రోజుల్లోనే తెలిసింది!

మనిషికో టేస్టన్నాడు బూతుకవి. గజ్జికుక్క కరిస్తే పధ్నాలుగింజక్షన్లు. విలన్‌గాడ్ని కుక్కతో కరిపించి - వాడిని గదిలో పెట్టి తాళం వేస్తే గోవింద! టమోటా ధర పాపం అందుబాటులోనే వుంది. పోయేకాలం కాకపోతే రోడ్డుమీద చదవడమేమిటి? టైం లేదన్నాడు ఇంగ్లీషు కవి!

రోడ్డు లైబ్రరీ అయితే గోతులు కూడా వుంటాయి. వాటి మాటేమిటి? ఈ మాటెవడన్నాడు? ఇంకెవడు - నేనే అని వుంటాను. కన్ను చిత్రం గీస్తుంది - పెన్ను ఫ్రేము కడుతుంది! అప్పుడేగా అన్నాను.

చచ్చేందుక్కూడా టైం లేదన్నాడు బాసు! అంతా పోజు. ఈస్తటిక్ కేత్రాస్ చచ్చిపోతున్నాయి. కాదాలిక్క నేరమిల్లే అంటే ప్రేమించడానిక్కూడా టైం లేదని కదూ అర్థం? కుక్క మొరగదే? కనక ఖచ్చితంగా కరుస్తుంది. దోసకాయలు దొరకద్దూ? చిన్నాడి దోసకాయ ఇప్పుడెక్కడుందో?

పేపరు వాడ్ని గదిలో పెట్టి తాళం వేయాలి. పధ్నాలుగు ఇంజక్షన్లతో గిలగిలా తన్నుకుని ఠామ్మంటాడు! అన్నట్టు - వీడు ఎవడికి విరోధి! నెగిటివ్ అప్రోచ్ మంచిది కాదు. కుక్కా ఈ ఫ్రండుని కరవకు. రేట్లు దించే ప్రభుత్వం కావాలి! పధ్నాలుగింజక్షన్లు పోవాలి. గజ్జి కుక్కలు చచ్చి టమోటాలు విరివిగా దొరకాలి. రోడ్డు మీద లైబ్రరీలను నిషేధించాలి!

అంతా టమోటాలో వుంటుందండి. కొంత దోసకాయల్లో కూడా వుండొచ్చు. కుక్కలెందుకు కరుస్తాయి? మనిషే కుక్కని కరుస్తే? పేపరు వాడు గోతిలో పడలేదు. కుక్కవాడ్ని అంటుకోలేదు. టమోటాలు దొరుకుతాయో లేదో...

ఇంతకీ నేను చెప్పాల్సింది కలవరింతలు గురించి కదూ?

ఇంకేం చెబుతాను? చైతన్యస్రవంతిలో పడ్డాను కదా?

చిత్తగించగలరు! ★

ఆయుధాల మజా – తన్నుకు చావండి ప్రజా

కచేరి

రుక్మిణి

ఎవడైనా మనూర్లోకి అధికార పార్టీవోడు గానీ వస్తే కాలరు అం దో ం కో ం ని

'కంపు' మండలంలోని మొత్తం గ్రామాలన్నీ కంపే కొడతాయి. ఈ 'కంపు' చాలా రకాలు. బురదకంపు... కుళ్ళు కంపు... మనుషుల మనసుల కంపు... అన్నట్లు దొరికే ఆ కొద్ది మంచినీళ్ళు మహా వికారమైన కంపు – దాన్లోనే తగుదునమ్మా అని కొన్ని గ్రామాల్లో ఫ్లోరైడు వ్యాధి...! కరువు కంపు అన్ని గ్రామాల్లో దుర్భరంగా వాయిస్తుంది. అబ్బో! ఈ కంపు భాగోతం ఈనాటిది కాదు. అంతకుముందు అంత ఇదిగా లేదు గానీ... ఈ స్వర్ణాంధ్ర.. విజన్ 2020 అనే నినాదాలు కంపు కంపుగా 'వినిపించడంతో జనం బాగా ఈ కంపుకలవాటు పడిపోయారు.

ఇక్కడో విషయాన్ని బాగా గ్రహించాలి. ఈ కంపు బాధలు పడలేక జనం చిల్లర కంపు రాజకీయాలకలవాటు పడి పోయారు. ఉదాహరణకు మండలంలోని 'ఇంపు' అనే గ్రామంలో జనానికి మంచినీళ్ళు దొరకడం లేదు. గుక్కెడు నీళ్ళ కోసం జనం గుండెలు బాదుకుంటున్నారు. ఇంపు గ్రామాన్ని ఆ సమస్య భూతంలా పట్టి పీడిస్తుంది. మంచినీళ్ళ కోసం గత ఏడెనిమిదేండ్ల నుండి అరిచీ... తొడలు చరిచీ.. వెంటనే మళ్ళీ ఎవరి కంపు పార్టీలోని వ్యవహారాలు వాళ్ళే చూసుకుంటున్నారు. 'స్వర్ణవిజన్' బాబుగారికి ఇది చాలా పెద్ద తలనొప్పి వ్యవహారంలా తయారైంది.

'సొంపు' అనే గ్రామానిది మరో కథ. వాళ్ళ గ్రామానికి ఇంతవరకూ కరంటు సౌకర్యమే లేదు. వాళ్ళు దానికోసం కసిగా... కాళ్ళరిగేలా తిరిగారు.. తిట్టారు! అట్లా కంపు మండలంలోని ప్రతి గ్రామంలోనూ చాలా దరిద్రమైన సమస్యలు...! ఏం చేయాలో అర్థంగాక వాళ్ళు బిత్తర పోతుంటే మరో కొత్త బెడద అడవుల్లోని అన్నలతో వచ్చిపడింది. వాళ్ళు తుపాకులు టపటప లాడిస్తూ గ్రామాలలో ఏదిపడితే అది పేల్చడం మొత్తం కంపు మండలంలో సర్వసాధారణమైపోయింది. అడపా దడపా స్వర్ణాంధ్ర పార్టీ నాయకుల్ని నరికి చంపడం కూడా ఎక్కువైపోయింది. వాళ్ళ ధాటికి ప్రభుత్వం కూడా చేతులెత్తేసినంత పని చేసింది!

ఇదుగో ఇపుడు తీరా ముందస్తు ఎన్నికలు తీసుకురావడంతో కంపు మండలం మరింత కకావికలమైపోయింది.

"ఎక్కడిదిరా స్వర్ణాంధ్ర... అంతా కంపేనాయె... దొరికినంత మేసుడేనాయె.. అరె... మా రైతులనెవడూ పట్టించుకోడు... అన్నిట్లోనూ 'ఫస్టే' అంటున్న బాబుగారు అసలు ఈ కొద్దిపాటి నక్సలైటు సమస్యను కూడా పరిష్కారం చేయకపాయె! ఛ... ఛ... ఒరే వాయించేద్దాం...

"అది కాదెసె... వారానికొకడి కాలు నరికో.. చంపిపారేస్తుంటేనూ ఇటు పోలీసులు.. అటు బాబుగారు ఏం చేస్తున్నట్లు... మరి అంతా హైటెక్కేనాయె... మంత్రులకేమో బోలెడంతమంది గన్‌మెన్లు... అసలు ఆ వైనాన్ని బాగా నిలబెట్టి అడగాల్రా.....

అట్లా జనం కోపంతో వూగిపోతూ అరుచుకుంటున్నారు!

* * *

'ఇంపు' గ్రామ సర్పంచ్ ఓ రోజు పొద్దునే ఒక వీధి వాళ్ళని పిలిపించి వారి ముందే ఒక పొడవుపాటి చెక్క పెట్టె తెరిపించాడు. అందరూ వెంటనే నోళ్ళు తెరిచారు.

"ఒరే.. ఇవి బారు ఫారిన్ తుపాకులు.. తలా ఓటి పుచ్చుకోండి... ఒక్కొక్కటి పాతిక దెబ్బల దాకా మోగిపోతది. ఒరే నుంకా... అందుకుని తలా ఓటి పంచరా... ఒక్కొక్కటి మీరు కొనుక్కోవాలంటే యాభైవేలు.. రేటు! ఒరే నక్కలోడా నక్సలైట్లు ఏ బజార్లో కనిపించినా పటపటలాడించెయ్యాలి...! సరిగ్గా మోగిచ్చడానికి ఓ రెండ్రోజులు ట్రయినింగిస్తారు. మన బాబుగారంటే మజాకా కాదు. ప్రెపంచకంలోనే పేరు మోగిన ముఖ్యమంత్రి గారు...ఆఁ..!"

మర్నాడు మరో బజారు జనాల్ని పిలిపించి చిన్న సైజు పెట్టెలు విప్పదీయించాడు.. అబ్బో... బుల్లి... బుజ్జి పిస్తోల్లు... సర్పంచుగారు సరదాగా మీసం దువ్వి పారేశారు. నిన్న చెప్పిన మాటల్నే కాస్తంత తేడాతో వాయించి అందరికీ వాయినాలు పంచాడు. అట్లా ఆ ఆయుధ సంతర్పణ ఓ పదిరోజుల దాకా సాగింది. జనాలు పండ్లు నూరుకుంటూ కసిగా ఇండ్ల దారి పట్టారు.

'సొంపు' గ్రామం సర్పంచుగారు ఒకేసారి యాభై పెట్టెలు వూడబీకి హాహాకారాలు చేసింది. వాట్నిండా బాంబులు... చిన్నసైజువీ... పెద్దవీ... వెంటనే వూరి ప్రజలందరినీ సమావేశపరిచి, నోరు పెద్దగా తెరిచి ఉద్రేక పడిపోయింది.

"అసలు మన కంపు మండలంలోని గ్రామాలన్నీ ఈ నక్సలైట్ల వల్లనే అభివృద్ధికాటం లేదు. వాళ్ళవి బూజుపట్టిన సిద్ధాంతాలు.. మన చెంద్రబాబుగారివి తాజా వూరేసిన ఆవకాయ బద్దలే... అదీ... మనం ఎంతో ముందుకు పోతున్నాం. పైకెగిరి పోతున్నాం.. ఇంటికి సంచీడు సరుకు తీసుకుపొండి... నక్సలైటు యాడ కనబడితే ఆడి మీదికి బాంబు వుండ విసరండి! ఆడవాళ్ళ ముందుగాలె.. అంతే... అంతా అభివృద్ధి జరిగిపోద్ది...

జనం పొలోమని మొదటి విడతగా తలా సంచీడు బాంబు వుండలు తీసుకుని ఆవేశపడుతూ కొంపలకు చేరుకున్నారు. అట్లా ప్రతి గ్రామానికీ బారు తుపాకులు.. ఎ.కె.47లు.. బాంబు వుండలు... కత్తులు.. కటార్లు చేరిపోయాయి... శుభం!

* * *

"అన్నా... మళ్ళా మనం ప్రపంచ బ్యాంకు నుండి అప్పు తెచ్చి ఇట్లా మొత్తం జనాలకు తుపాకులు కొనియ్యటం వల్ల లాభం ఏంది? దండగ కర్సు... పక్క రాష్ట్రాల వాళ్ళు హేళనగా నవ్విపోతున్నారు" – ఒకమంత్రి విచారం నటిస్తూ అన్నాడు.

బాబుగారు చిన్నగా దగ్గి మరింత గుంభనంగా వ్యవహారాన్ని విడమరిచాడు. మంత్రులందరు చెవులప్పగించి వింటున్నారు. పోలీసు మంత్రికి మరి 'తమ పోలీసులెందుకో అర్థం గాక తలపట్టుకు కుళ్ళి కుళ్ళి విచారపడిపోతున్నాడు.

"రేపటి ఎన్నికలలో మన ప్రతిపక్షాలు నక్సలైట్లతో కుమ్మక్కయిపోయారు. మనం కూడా గ్రామగ్రామాన వున్న మన గట్టి క్యాడరుకు – వీళ్ళెవరైనా ప్రచారానికొస్తే అస్త్రాల్ని ప్రయోగించి పారేయమని చెప్తాం... దాంతో రెంటికీ సరిపోతుంది..."

పోలీసు మంత్రి విరుచుకుపడిపోయాడు. 'మరో సంగతి... ఈ ఎన్నికలయ్యే దాకా జనాలు' మాకిది కావాలి' అని మనల్ని అడగరు. ఎందుకంటే శాంతిభద్రతలుంటేనే అభివృద్ధి... బాధ్యత వాళ్ళది...

ఇదేదో కాస్తంత వినసొంపుగా వుందని కొందరు మంత్రులు తలకాయలు మరింత ముందుకు సాచారు.

"వూర్ల జనం ఒకర్ని ఒకరు చంపుకునే గోలలో ఈ ఎన్నికల గండం కాస్తా గడిచిపోతుంది" మంత్రులందరూ చప్పట్లు చరిచారు. అయితే కాస్త స్వంత ఆలోచన చేసే మంత్రి విచారకంగా ఇలా అన్నాడు. "అంతా బాగానే వుంది.. అన్నీ వూర్లలో సమస్యలే.. తిండి లేదు... కరెంటు దెబ్బ.. సరే... భూములు పంచుకుందాం అని నక్సలైట్లు ప్రజల్ని మెప్పించి దండుకట్టి మన అసమర్థత మీదా...పనికి వూదర పథకాల మీదా తగులుకుంటే? జనం అసలే మంటలో వున్నారు... మనవేమో రాంబాణం లాంటి ఆయుధాలిస్తిమి గదా...

బాబుగారు వెంటనే మూర్ఛలోకి జారుకున్నాడు! ★

పన్నుపోటు - పసరు మందు!

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

అర్ధరాత్రి పన్నెండు అయి ఉంటుంది.

ఇంట్లో అందరూ మంచి గాఢ నిద్రలో ఉన్న సమయం.

పదహారేళ్ళ ప్రణతికి నిద్రా భంగమయింది.

ఆమెకు భయంగొలిపే కలవచ్చిందనో, సహజ అవసరాలకు నిద్ర లేచిందనో అనుకుంటే పొరపాటే మరి! ఉన్నట్లుండి ప్రణతికి విపరీతమైన నొప్పి రావడం మొదలు పెట్టింది. పంటికి రంధ్రమైన విషయం సంవత్సరం ముందే ప్రణతికి తెలుసు. కాని, అప్పట్లో నొప్పి రాకపోవడం వల్ల, ఇంట్లో చెబితే, వెంటనే దంతవైద్యులకు చూపిస్తారని, వాళ్ళ దగ్గరకు వెళితే పన్ను పీకేస్తారనే భయంతో, ఆ విషయాన్ని తన మనస్సులోనే ఉంచుకుందే తప్ప ఎవరికీ చెప్పలేదు. అయితే పంటి రంధ్రం మాత్రం ఊరుకోలేదు. అది దినదిన ప్రవర్ధమానమై, పంటి వివిధ పొరలను దాటి, నొప్పిని కలిగించే (పల్ప్ కుహరం) పొరలోనికి మార్గం ఏర్పరచుకోవడం వల్ల, అది ఉన్నట్టుండి ప్రణతికి నిద్రాభంగం కలిగించింది.

ఆమె విపరీతమైన బాధతో మూలుగుతూ, ఏడుస్తూ ఉంటే, తల్లిగాని, తండ్రిగాని తమ నిద్రను త్యాగం చేయలేదు. పక్కనున్న బామ్మగారు మాత్రం లేచి పరుగున వచ్చింది. ప్రణతి బాధను చూచి, చీకట్లోనే బయటికి పోయి, ఏదో ఆకులు తెచ్చి, చేతితోనే నలపగా వచ్చిన రసాన్ని ప్రణతి చెవిలో పోసింది. పన్ను నొప్పి వస్తుంటే చెవిలో ఎందుకు పోస్తోందో అడిగే ఓపిక లేకపోవడంతో పెద్దావిడన్న భరోసాతో, నొప్పి తగ్గుతుంది కదా అని ఎదురు చూసింది. ఎంత సమయం అయినా, పంటినొప్పి తగ్గలేదు సరికదా, చెవి మంట మొదలైంది. ఇక పంటినొప్పిని, చెవినొప్పిని భరించలేక, ప్రణతి తండ్రిని నిద్రలేపక తప్పలేదు. ఆ తర్వాత డాక్టర్‌ను సంప్రదించక తప్పలేదు.

ఇక్కడ ప్రణతి సంఘటన ఒక్కటి కాదు చాలామంది ఇళ్ళలో జరిగే తంతు ఇది! వైద్య విధానాలలో, ముఖ్యంగా దంత చికిత్సా విధానాలలో ఎన్నో ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ సమాజంలోని ప్రజల్లో కొన్ని మూఢనమ్మకాలు నరనరాన జీర్ణించుకొనిపోయి ఉండడం వల్ల, అవి బామ్మల రూపంలోను, గృహవైద్యం రూపంలోను కొత్త ఇబ్బందులను కొని తెచ్చిపెడ్తుంటాయ్. అసలు 'పన్నుపోటు' ఎందుకు వస్తుంది ? అన్న విషయంలో కనీస ప్రాథమిక పరిజ్ఞానం ఉన్నట్లయితే ఈ మూఢనమ్మకాల చలామణికి ఆనకట్ట పడ్తుంది.

పన్నుపోటు లేదా పంటి సలుపు లేదా పంటినొప్పి రావడానికి అనేక కారణాలున్నాయి. వాటి గురించి సమగ్రంగా తెలుసుకున్నట్లయితే సకాలంలో తగిన చికిత్స చేయించుకుని బాధనుండి తప్పించుకోవచ్చు.

పన్నుపోటుకు ప్రధాన కారణాలు :

1) పంటి లేదా చిగురు వ్యాధులు

2) శరీర వ్యాధులు

3) ప్రమాదాలు

పంటి వ్యాధులు :

దంతాలకు సంబంధించి అనేక వ్యాధులు ఆయా పరిస్థితులను బట్టి, ఆయా వ్యక్తులకు, ఆయా కారణాల వల్ల వస్తుంటాయి. ఇక్కడ సాధారణంగా ఎక్కువ మందిలో పన్నుపోటు రావడానికి ఎలాంటి దంత వ్యాధులు కారణం అవుతున్నాయో తెలుసుకుందాం.

1) పిప్పి పన్ను (పల్పయిటిస్) వ్యాధి : ఆరోగ్య పరిరక్షణ విషయంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న వారికైనా, ఎక్కువ శాతం మందిలో, ఏదో సమయంలో పిప్పి పన్ను వ్యాధి బారి పడని వారుండరు. పిప్పి పన్ను వ్యాధి రావడానికి ప్రధాన కారణం నోటి అపరిశుభ్రత (దంతధావన లోపం) అయినప్పటికీ, వ్యాధి ప్రారంభం అయిన వెంటనే నొప్పి రాకపోవడంతో దాని అభివృద్ధిని గమనించలేని పరిస్థితి ఏర్పడుతుంది. పంటి నిలువుకోతను పరిశీలిస్తే మనకు మొదట కన్పించేది పింగాణి (ఎనామిల్) పొర, దాని తర్వాత డెంటిన్ పొర, ఆ... తర్వాతది అతి ముఖ్యమైనది 'పల్ప్' అనే పొర.

పంటికి రంధ్రం మొదట పింగాణి పొరలో ప్రారంభం అయినప్పటికీ రంధ్రాన్ని గమనించినా 'నొప్పి' లేకపోవడం వల్ల, దానిని పెద్దగా పట్టించుకోరు. పింగాణి పొరకు నరాల సదుపాయం లేకపోవడమే ఈ స్థాయిలో నొప్పి రాకపోవడానికి ప్రధాన కారణం.

పంటి రంధ్రం (పిప్పిపన్ను వ్యాధి) పింగాణి పొరను దాటి డెంటిన్ పొరకు చేరుకున్న సమయంలో కొద్దికొద్దిగా పన్ను పోటు మొదలవుతుంది. ఇది కూడా కాస్త భరించే స్థాయిలోనే ఉంటుంది. ఈ స్థాయిని దాని పంటి రంధ్రం అతి ముఖ్యమైన పొర 'పల్ప్ కుహరం' లోనికి మార్గం ఏర్పరచుకున్న తక్షణం పన్నుపోటు అధికమవుతుంది. భరించలేని స్థాయికి చేరుకుంటుంది. కత్తితో కసుక్కున పొడిచినంత బాధ కలుగుతుంది. ఈ స్థాయినే 'పల్పయిటిస్' అంటారు.

ఈ సమయంలోనే, పన్ను తీయించుకోవాలా? మరేదైనా చికిత్స చేయించుకోవాలా అన్న సందేహం కలుగుతుంది. ఇలాంటప్పుడు ఎలాంటి గృహ వైద్యాలు లాభం లేదు. పంటిపోటు అధికంగా ఉన్నా, పన్ను గట్టిగా ఉండి, చిగురు ఆరోగ్యంగా ఉంటే, అలాంటి పన్నును తీయించుకోవలసిన అవసరం లేదు. 'ఎక్స్-రే' ఫొటోల ద్వారా, పంటి, చిగురు, దవడ ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసి, అనుకూల పరిస్థితులు ఉంటే, అలాంటి పళ్ళకు 'మూల చికిత్స' చేయవచ్చు. దవడ, పన్ను, చిగురు అనారోగ్య శాతం అధికంగా ఉన్నట్లయితే ఆ పంటిని తక్షణం తీయించుకోవడమే దీనికి సరైన చికిత్స అవుతుంది.

2) పంటిచిగురువాపు వ్యాధి :

రకరకాల చిగురు వ్యాధులు కూడా పన్ను పోటుకు కారణం అవుతాయి. ఇటువంటి సమయాలలో, వ్యాధి నిర్ధారణ ఎంతో అవసరం. చిగురు వ్యాధి రావడానికి గల కారణం తెలిస్తే దాని చికిత్స అంత కష్టమైన పని కాదు.

సాధారణంగా నోటి అపరిశుభ్రత వల్ల (పంటి 'గార' ఏర్పడి), కొన్ని రకాల మందులు వాడడం వల్ల, రక్తసంబంధమైన కొన్ని ప్రమాదకరమైన వ్యాధుల వల్ల కూడా చిగురు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందుకే వ్యాధి నిర్ధారణ ప్రధానం.



3) 'ఇంపాక్టెడ్' పన్ను : ప్రతి పన్నుకూ దవడలో మొలిచి స్థిరవాసం ఏర్పరచుకోవడానికి ఒక్కో వయస్సు ఉంటుంది. ఆయా వయస్సుల ప్రకారం దవడలో ఉన్న పంటి మొగ్గలు దంతాలుగా అభివృద్ధి చెంది, చిగురును చీల్చుకొని బయటికి వస్తాయి. కాని కొన్ని దంతాలు బయటికి రాలేక పూర్తిగా దవడలో ఉండిపోవడం గాని, పాక్షికంగా బయటికి రావడం గాని జరుగుతుంది. ఇలాంటి దంతాలను 'ఇంపాక్టెడ్ టీత్' అంటారు. ఇవి సాధారణంగా రెండు దవడలలోని మూడవ విసురుదు దంతాలై ఉంటాయి. వీటినే 'జ్ఞానదంతాలు' అని కూడా అంటారు. దవడలోని నరంమీద ఒత్తిడి చేయడం వల్ల, పంటి చుట్టూతా చిగురువాపు రావడం వల్ల, వ్యాధి దవడను కూడా చేరుకునే పరిస్థితి ఉండడం వల్ల భరించలేని పంటిపోటు రావచ్చు. ఇలాంటి పళ్ళకు సాధారణంగా పన్ను తీయడమే చికిత్స అవుతుంది. ఈ దంతాలు ఆహారం నమిలే విషయంలో ఉపయోగానికి రావు. పైగా అందంగా కన్పించేవీ కావు. అందుచేత వీటిని తొలగించడమే ఉత్తమమైన మార్గం. అయితే ఇలాంటి దంతాల రచన వివిధ రీతుల్లో ఉండే అవకాశం ఉన్నందున, ఎక్స్-రే సదుపాయం లేకుండా పన్ను తీయడానికి, తీయించుకోవడానికి సాహసించకూడదు.

4) చచ్చుపన్ను : వివిధ కారణాల వల్ల పంటికి రక్తప్రసారం ఆగిపోయి, రంగుమారిపోయి, చిగురును, దవడను వ్యాధిగ్రస్థం చేయగల సత్తా వున్న పన్నును 'చచ్చుపన్ను' అంటారు. చచ్చుపన్ను వల్ల దవడలో వ్యాధి ముదిరితే, పన్నుపోటు అధికంగా వస్తుంది. పంటినుంచిగాని, పంటి పక్కన ఉండే చిగురు నుండి గాని, చీములేదా చీము-నెత్తురు ప్రవించే అవకాశం ఉంది. ఇవి రక్తప్రసారంలో కలిస్తే, ప్రమాదకరమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందుచేత చచ్చుపడిన పన్ను అయినప్పటికీ అది కదలకుండా గట్టిగా ఉంటే ఎక్స్-రే సహాయంతో మూలచికిత్స చేయించుకోవచ్చు.

మూల చికిత్సకు అనువుకాని సచ్చుపన్నును తీయించుకోవడమే మంచిది. లేకుంటే ఆ... నొప్పిని భరించడం చాలా కష్టం. మందులతో బాధా నివారణ తాత్కాలికంగానే ఉంటుందన్న విషయం మరువకూడదు.

ఎ) అరిగిన పన్ను - కరిగిన పన్ను : అనేక కారణాల వల్ల కొన్ని పళ్ళు అరిగిపోవడం లేదా కరిగిపోవడం జరుగుతుంది. పన్ను అరిగిపోవడాన్ని 'అట్రిషన్' అని, కరిగిపోవడాన్ని 'ఇరోసన్' అని అంటారు. పన్ను అరిగినా, కరిగినా, పంటి అతి ముఖ్యభాగమైన పల్ప్ కుహరం బయటపడి భరించలేనంతగా పన్నుపోటు మొదలవుతుంది. పన్నుపోటు స్థాయిని బట్టి, పన్ను అరిగిన/కరిగిన పరిస్థితిని బట్టి మూలచికిత్స, దాని తర్వాత వాటికి 'పంటి తొడుగులు' చేయించుకోవచ్చు. మూల చికిత్సకు అనుకూలంగా లేకపోతే, ఆ పన్ను తీయించుకోవడమే మంచిది.

బి) పంటిముక్కలు : పన్నుపోటుకు, 'పంటిముక్కలు' కూడా కారణం అవుతుంటాయి. అరిగిపోవడం వల్లగాని, విరిగిపోవడం వల్లగాని, పంటి రంధ్రాల వల్ల పన్ను పగిలిపోవడం వల్లగాని, పంటిముక్కలు దవడల్లో ప్రత్యక్షమవుతుంటాయి. ముఖ్యంగా వృద్ధుల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి. ఇది పనికిరాని 'కాలిలో ముల్లు' లాంటివి. వాటిని తొలగించే వరకు అవి ఏదో రకంగా ఇబ్బందిని కలిగిస్తూనే ఉంటాయి. అలాంటి ఇబ్బందుల్లో 'పన్నుపోటు' ఒకటి.



శరీర వ్యాధులు :

ఎ) మాగ్జలరీ సైనసైటిస్ : పై దవడ పై భాగంలో, కళ్ళకు కింద, ముక్కుకు రెండు వైపుల రెండుగాలి గదుల్లాంటి ప్రదేశాలు ఉంటాయి. వాటినే 'మాగ్జలరీ సైనస్'లు అంటారు. పై దవడకు సంబంధించిన కొన్ని దంతాల మూలభాగాలు, సైనస్‌ల అడుగు భాగానికి ఆనుకొని ఉంటాయి. అందుచేత 'సైనసైటిస్' అనే వ్యాధి వచ్చినప్పుడు ఆ ప్రాంతంలో ఉన్న దంతాల పోటు వస్తుంది. దానికి ఎక్స్‌రే ద్వారా పరిశీలించి నిర్ధారణ జరిగినప్పుడు, సైనస్‌కు చికిత్స చేయించుకుంటే, పంటిపోటు దానికదే తగ్గిపోతుంది. పంటికి వ్యాధి వచ్చినా 'సైనస్' గతి ఇంతే అవుతుంది.

అ) న్యూరాల్జియా : దవడలలో ఉండే నరాలకు సంబంధించిన సమస్యలను 'న్యూరాల్జియా' అంటారు. సమస్య ఏ నరం వల్ల వస్తే ఆ నరం పేరుతో న్యూరాల్జియాను పిలుస్తారు.

ఈ న్యూరాల్జియాల వల్ల, పంటిపోటును దృష్టిలో ఉంచుకొని దంత వ్యాధుల వల్లనే పంటిపోటు వస్తుందనుకొని చాలామంది వళ్ళను తీయించేసుకుంటారు. అయినా పంటిపోటు తగ్గదు. అందుచేత ఇక్కడ పంటిపోటుకు పన్ను తీయించుకోవడం పరిష్కారం కానేకాదు. నరాలకు చికిత్స చేయించుకోవాలి. అప్పుడే పంటిపోటు కూడా తగ్గుతుంది.

ఇ) నోటిక్యాన్సర్ : పళ్ళకు సంబంధించిగాని, చిగుళ్ళకు సంబంధించిగాని, నాలుకకు సంబంధించిగాని కాన్సరు వ్యాధి వస్తే, ఆయా ప్రాంతాలలో ఉండే పళ్ళ ద్వారా పంటిపోటు కూడా రావచ్చు. నోటి క్యాన్సరుకు చికిత్స జరిగినప్పుడే పంటిపోటుకు ఉపశమనం లభిస్తుంది.

ప్రమాదాలు :

అ) విరిగిన దవడలు - దంతాలు : ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు గాని, కొట్లాటలు జరిగినప్పుడు గాని దవడలో గాని, వాటికి సంబంధించిన దంతాలు గాని విరిగితే, అప్పుడు పంటిపోటు వచ్చే అవకాశం ఉంది. చికిత్స ద్వారా విరిగిన దవడలను అతికించవచ్చు. కాని పళ్ళ విషయంలో మాత్రం పరిస్థితిని బట్టి మూల చికిత్స చేయడమా? పంటిని తొలగించడమా? అన్నది వైద్యుడి పరీక్ష మీద ఆధారపడి ఉంటుంది. ఏ చికిత్స జరిగినా పంటిపోటును అదుపు చేయవచ్చు.

ఆ) దంతధావనం : పళ్ళు తోముకోవడాన్ని దంతధావనం అంటారు. బొగ్గుపొడి వంటి గరుకుపొడులతో గాని, పంటి పుల్లలతో గాని, హార్డ్‌బ్రష్‌లతో గాని పళ్ళు తోముకున్నప్పుడు పళ్ళు అరిగిపోయి నరాలు బయటపడడం ద్వారా పంటి సలుపు వచ్చే అవకాశం ఉంది. అందుచేత సంరక్షిత దంతధావన విధానాలను తెలుసుకోవాలి. పళ్ళను గట్టిగా తోమడం, ఎక్కువసేపు తోమడం తగ్గించాలి. మెత్తని బ్రష్‌తో మృదువుగా అయిదు నిముషాలు పళ్ళు తోముకుంటే సరిపోతుంది. గంటలకొద్దీ పళ్ళు తోమడం 'పన్నుపోటు'ను ఆహ్వానించడమే అవుతుంది.

గానుగ, వేప పుల్లలతో దంతధావనం చేసుకునే వాళ్ళు సైతం పుల్ల కొసను మెత్తగా నమిలి, బ్రష్ మాదిరిగానే మృదువుగా తోముకోవాలి. పదునుగా లేని 'నాలుకబద్దతో నాలుక జాగ్రత్తగా గీసుకోవాలి.

చికిత్సా విధానాలు :

పంటి పోటుకు చికిత్స, వ్యాధి నిర్ధారణ సక్రమంగా జరిగినప్పుడే సాధ్యమవుతుంది. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారాను, తాత్కాలికంగా మందులు వాడడం, పంటితొడుగులు వాడడం వంటి చికిత్సా విధానాలు సత్ఫలితాలనిస్తాయి. తొందరపడి పన్ను తీయించుకోవడం గాని, అవసరానికి పన్ను తీయవలసి వస్తే నిరాకరించడం గాని చేయకూడదు.

మంత్రాలకు చింతకాయలు ఎలా రాలవో అదే విధంగా, పన్ను పోటుకు పసరు మందు వైద్యం కాదు. నిరక్షరాస్యులే కాదు, అక్షరాస్యులు సైతం ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. వైద్యరంగాన్ని మూఢనమ్మకాలకు దూరంగా ఉంచాలి. ★

చారిత్రక పరిశోధనా గ్రంథం



సునాముది జీవధార
(మందస రైతుల ప్రతిఘటన - చరిత్ర - కథనం)
రచన : డా॥ కె.ముత్యం,
ప్రచురణ మరియు ప్రతులకు :
ప్రజాశక్తిబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,
వెల : రు.75, **పేజీలు :** 270

చరిత్ర నిర్మాణంలో మనకు తెలియని విషయాలు, మన దృష్టికి రాని విషయాలు ఖాళీలుగా మిగిలిపోతాయి. తర్వాత కాలంలో లభించిన రుజువులు, విశ్లేషణల ఆధారంగా కొన్ని కొత్త సత్యాలు వెలికివచ్చి ఆ ఖాళీలను పూరిస్తాయి. అందుకే చరిత్ర ఎప్పుడూ మరింత నిగ్గుతేల్చిన కొత్త నిజాలతో సజీవంగా మనముందుకు వస్తుంది.

రాజులపరంగా, రాజవంశాల పరంగా చరిత్రను అన్వయించే ధోరణికి కాలం చెల్లింది. ప్రజాపరంగా చరిత్రను విశ్లేషించడమనేది ప్రజాస్వామ్య పద్ధతి, శాస్త్రీయమైనది కూడానూ. ఆధునిక భారతదేశ చరిత్ర అంటే కాంగ్రెస్ చరిత్రగానే తయారైంది. కాంగ్రెస్‌కు బయటవుండి పోరాడిన వాళ్ళు, తిరుగుబాటుదారులు, అతివాదులను కాంగ్రెస్ వాళ్ళు పట్టించుకోలేదు సరికదా వాళ్ళను ఖండించడంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వానికే పరోక్షంగా సహాయ పడ్డారు. చరిత్రలో గిరిజనులు-రైతుల ప్రతిఘటనలు, పోరాటాలు అనేకం కనిపిస్తున్నా వాటిని స్థానిక తిరుగుబాట్లుగానో, జమిందారు-సామంతుల మీద చేసిన అలజడిగానే పరిగణించి వాటిని వలసవాద వ్యతిరేక పోరాటంలో భాగంగా గుర్తించడానికి నిరాకరించారు. అలా విస్మృతికి గురైన ఒక సంఘటనే "మందస కాల్పులు" లేక "గున్నమ్మ కథ"గా ప్రసిద్ధమైన రైతాంగ ప్రతిఘటన.

ఈ పుస్తకం తెలుగునాట రైతులు - జమిందారీ పాలకుల్ని, బ్రిటీష్ అధికారుల్ని ప్రత్యక్షంగా ఎదిరించిన 'దొమ్మి'ని అధ్యయనం చేసింది. శ్రీకాకుళ ప్రాంతపు మందస జమిందారీలోని గుడారి రాజమణిపురం ఆ చుట్టుపక్కల ఏడు ఊర్ల రైతులు 1940 మార్చి చివర్లో పై అధికారాన్ని ప్రతిఘటించారు. దీనిలో గున్నమ్మ అనే ఒక స్త్రీతో పాటు నలుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారు. జాతీయోద్యమం ఉధృతంగా సాగినపుడు 'మందస కాల్పులు'గా రాష్ట్రమంతా ప్రచారమై, రైతు ఉద్యమాన్ని ఉత్తేజపరిచి వివిధ రాజకీయ పక్షాల్లో చర్చకు దారితీసింది. ఈ మందస రైతు ప్రతిఘటన తర్వాత కాలంలో జాతీయోద్యమ చరిత్ర రచనల్లో విస్మరించబడ్డది. స్థానిక సంఘటనగా దాన్ని త్రోసిపుచ్చినా కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకొని లాభపడ్డారు. కాంగ్రెస్ వారి ప్రమేయం లేకపోవడం వల్ల ఈ సంఘటన రికార్డు కాకపోయి వుండవచ్చు.

మందస కాల్పుల సంఘటనపై వచ్చిన వివిధ లిఖిత కథనాలను దీన్ని వీరగాథగా మలిచి పాడుకునే మౌఖిక సాహిత్యాన్ని కూలంకషంగా విశ్లేషించి వాటిలోని కాల్పనికాంశాలను, స్థానీయతను, చారిత్రక ప్రాధాన్యాన్ని విడదీసి దాన్నొక చారిత్రక గ్రంథంగా రూపొందించడంలో పరిశోధకుడు ముత్యం చేసిన కృషి ప్రశంసనీయం. క్షేత్ర పర్యటన చేసి, అప్పటి వ్యక్తులను - వారి వారసులను ఇంటర్వ్యూ చేసి, వృత్తి గాయకుల కథలను - రైతులు పాడుకునే పాటలను సేకరించి, దొరికిన ఆధారాలతో తులనాత్మకంగా విశ్లేషించి ఒక పరిశోధనా గ్రంథంగా దీన్ని మలచిన తీరు ఆసక్తికరం. యూనివర్సిటీ వెలుపల నుండి వచ్చిన ఒక అత్యుత్తమ పరిశోధనా గ్రంథంగా ఈ పుస్తకానికో ప్రత్యేకత ఉంది.

- కె.పి.అశోక్‌కుమార్

స్వీకారం



సత్తావున్న మనసుకే సక్సెస్
రచన : పగడపాల కట్టా తిరుమల
వెల : రు.25,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ప్రజాశక్తిబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,

చైనా నీతి కథలు
ఫెంగ్‌షుఫెంగ్
సంకలనం, కథనం : ముక్తవరం పార్థసారథి
వెల : రు.15,
ప్రతులకు : ప్రజాశక్తిబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,



హైడీ
జొహానాస్పైరి
సంకలనం, కథనం : వివేక్
వెల : రు.20, ప్రతులకు :
ప్రజాశక్తిబుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,

మూషిక దౌత్యము
రచన : సుశర్మ
వెల : రు.20, ప్రతులకు : శారదా సాహితీ సమాఖ్య, కోదాడ, కేరాఫ్ యు-లైక్ బుక్‌స్టాల్, నయానగర్, కోదాడ - 508 206, నల్లగొండ జిల్లా; విశాలాంధ్ర పబ్లిషర్స్ అన్ని బ్రాంచీలలో; తమ్మర శ్వేత, తమ్మర ఆంజనేయశర్మ, గుడిబండ

యోగం భోగానికా? రోగానికా?
రచన : కుర్రా హనుమంతరావు;
వెల : రు.30,
ప్రతులకు : రావిపూడి వెంకటాద్రి, ఎడిటర్, హేతువాది, చీరాల; కుర్రా హనుమంతరావు, రాడికల్ హ్యూమనిస్టు సెంటర్, ఇంకొల్లు



శేషు

తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడు

టూరిస్ట్‌గైడ్

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన తిరుమల తిరుపతి వెంకటేశ్వరుని ఆలయం చిత్తూరు జిల్లాలోనే ఉంది. దట్టమైన అడవులు, ప్రకృతి అందాలు, లెక్కలేనన్ని ప్రాచీన ఆలయాలతో చిత్తూరు జిల్లా అలరారుతుంది. తెలుగు వారు జీవితంలో ఒకసారైనా తిరుపతిలోని వెంకటేశ్వరుని దర్శించుకోవాలనుకుంటారు. దేశం నలుమూలల నుండే గాక ఇతర దేశాల నుండి తిరుమల ఆలయాన్ని సందర్శించడానికి వస్తుంటారు. భారతదేశంలో అత్యధిక ఆదాయం గల ఆలయంగా తిరుమల ప్రసిద్ధికెక్కింది. ఈ ఆలయానికి ప్రాచీన చరిత్ర ఉంది. పల్లవులు మొదలు విజయనగర ప్రభువుల వరకు ఈ ఆలయాన్ని పోషించారు. ప్రధాన ఆలయం దక్షిణ భారతదేశంలోని ప్రాచీన శిల్పకళా రీతులను ప్రతిబింబిస్తుంది. ఆలయ ధ్వజస్తంభానికి బంగారు తొడుగు ఉంది. వెంకటేశ్వరుడు కొలువుతీరి ఉన్న ఏడుకొండలపై పర్యాటకులు సందర్శించడానికి ఇంకా పలు ప్రదేశాలు ఉన్నాయి.

శిలాతోరణం

ప్రకృతి సృష్టించిన అద్భుతాల్లో ఒకటిగా పేర్కొనే శిలాతోరణం తిరుమల కొండలపై ఉంది. 150 కోట్ల సంవత్సరాల క్రితం సంభవించిన ప్రకృతి భీభత్సాల కారణంగా పర్వతాలు కోతకు గురై ఈ శిలా తోరణం ఏర్పడిందని శాస్త్రవేత్తల అంచనా. ఆసియాలో ఇటువంటి అద్భుతం ఇదొక్కటే. ప్రపంచంలో ప్రకృతి సిద్ధ శిలా తోరణాలు అమెరికాలో ఒకటి, ఇంగ్లాండ్‌లో ఒకటి మాత్రమే ఉన్నాయి.

శ్రీ వెంకటేశ్వర జూ పార్క్

తిరుపతి రైల్వే స్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరంలో 2200 హెక్టార్ల స్థలంలో ఈ జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ అనేక అరుదైన జంతువుల, పక్షులు చూడవచ్చు. అలాగే అలిపిరి గేటు సమీపంలో 2.5 ఎకరాల స్థలంలో భూమిపై మానవులు ఆవిర్భవించక పూర్వయుగపు జంతువుల ఆకారాలతో ఒక పార్క్ ఏర్పాటు చేశారు. 25 కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై జీవించాయని చెబుతున్న రాక్షస బల్లుల జాతుల నిజమైన సైజులోని బొమ్మలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.

చంద్రగిరి కోట

విజయనగర రాజుల చిట్టచివరి రాజధాని అయిన చంద్రగిరిలోని కోట ఆనాటి వైభవానికి అద్దం పడుతుంది. స్వర్ణముఖి నదీ తీరాన ఈ కోట నిర్మించారు. కోట శిథిలావస్థకు చేరుకున్నా అందులోని రాజా మహల్, రాణీ మహల్ ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. తిరుపతికి 12 కిలోమీటర్ల దూరంలోనే చంద్రగిరి ఉంది. కోట శిథిలమైనా నిలిచి ఉన్న నిర్మాణాలను కాపాడుతూ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా విజయనగర సామ్రాజ్య వైభవాన్ని వివరిస్తోంది.

కాణిపాకం

11వ శతాబ్దానికి చెందిన కాణిపాకం గణపతి ఆలయం కొన్ని ప్రత్యేకతలు సంతరించుకుంది. ఇక్కడి వినాయక విగ్రహం పెరుగుతోందని అంటారు. దీనికి ఉదాహరణగా 50 సవత్సరాల క్రితం వినాయకుని విగ్రహానికి తొడిగిన కవచం ఇప్పుడు సరిపోవడంలేదని చెబుతారు. కాణిపాకం తిరుపతికి 70 కిలోమీటర్ల దూరంలో చిత్తూరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది.

హార్సీహిల్స్

రాష్ట్రంలో ప్రముఖ హిల్‌స్టేషన్‌గా పేరుపొందిన హార్సీహిల్స్‌కు బ్రిటిష్ కాలంలో కడప కలెక్టర్‌గా పనిచేసిన హార్సీ పేరు పెట్టారు. ఆనాడు ఈ ప్రాంతానికి విహారానికి వచ్చిన కలెక్టర్ ఈ ప్రదేశం ప్రాముఖ్యతను, ప్రకృతి రమణీయతను బయటి ప్రపంచానికి వెల్లడించాడు. ఎంత మండువేసవిలోనైనా ఇక్కడ చల్లగా ఉంటుంది. సముద్ర మట్టానికి 1265 మీటర్ల ఎత్తులో ఉన్న హార్సీహిల్స్ తిరుపతికి 140 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అలాగే బెంగుళూరుకి కూడా అదే దూరంలో ఉంటుంది. దట్టమైన అటవీ ప్రాంతమైన ఇక్కడ ఎన్నో రకాల జంతువుల, పక్షులు కనిపిస్తాయి. ఏడాది పొడవునా ఇక్కడ సినిమా షూటింగులు జరుగుతుంటాయి. పర్యాటకుల సందడి కూడా ఎప్పుడూ ఉంటుంది. చిత్తూరు జిల్లాలో ఇంకా ఎన్నో చెప్పుకోదగ్గ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. ★



చంద్రగిరి కోట

మట్టిలో మాణిక్యాలు వెలికితీసిన 'తాటికొండ'



యాసలపు సూర్యారావు

నటనకు నగిషీలు చెక్కే కళా శిల్పి తాటికొండ. నాటకమన్నా, నటనన్నా ఆయనకు పంచ ప్రాణాలంటారు. ఆయన ఎంచుకునే ప్రక్రియ ఓ ప్రత్యేకతను కలిగి ఉంటుంది. అది తనకు నచ్చిన ఒక నాటకాన్ని, నాటికను సెలెక్టు చేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో మనుషుల్ని .ఎంచుకుని వారిని మంచి నటులుగా తీర్చిదిద్దటం ఆయన ఆశయపథం. తను కూడా ఒక మధ్యతరగతి రైతు కుటుంబం నుండి వారే. తాటికొండ పుట్టింది వచ్చిన తూర్పుగోదావరి జిల్లా. పిఠాపురం మండలం ఫకృదీనపాలెం గ్రామంలో. పేరు ముమ్మిడి చిన్నారావు. అందరూ తాటికొండనే పిలుస్తారు. 1976లో 'కెరటాలు' అనే నాటకంతో ఆయన నాటక రంగంపై ఆరంగేట్రం చేశారు. ఇప్పటి వరకూ ఆయన నటించి, దర్శకత్వం వహించిన '20' నాటకాలు '25' నాటికలు వివిధ పరిషత్‌ల్లో, రాష్ట్రస్థాయిలో ప్రదర్శించటం జరిగింది. ఆయన దర్శకత్వం వహించిన, నటించిన కళా ప్రదర్శనలు 800గా ఉన్నాయి. "సిమ్మాదిరప్పన్నకొండదిగిరా" అనే నాటకం తన నేతృత్వంలో 50 ప్రదర్శనలు ఇవ్వటం జరిగిందని .అంటారు ఆయన. ఆ నాటకాన్ని పది సమాజాల వారిచే ప్రదర్శింపజేసి శహభాష్ అనిపించుకున్నారాయన. 2000 సంవత్సరంలో 'రుణం' నాటకం నంది నాటకోత్సవాలకు వెళ్ళింది. 2003లో స్త్రీ గుడింతం నాటకాన్ని నందికి తాటికొండ దర్శకత్వంలో తీసుకెళ్ళారు. ఉత్తమ రంగాలంకరణకు ఎన్నికైంది. స్త్రీ గుడింతం నాటకాన్ని అందరూ స్త్రీలతోనే చేయించారు. నంది ఉత్సవాల్లో కొత్తదనాన్ని ప్రేక్షకులకు చూపించారు. తెలుగు నాటక రంగంలో స్త్రీని, పురుషాధిక్యంతో చిన్నచూపు చూడటాన్ని ఆయన సహించలేకపోయారు. స్త్రీ నాటక రంగస్థలంపై పురుషునికి ఏ మాత్రం తీసిపోదని, నవరసాలను రంగస్థలంపై పండించటంలో పురుషుల కంటే స్త్రీలే అద్భుతంగా అభినయించగలరని తన అనుభవంలో గ్రహించానన్నారు. ఆ నేపథ్యంలోనే తాటికొండ స్త్రీ కళాకారులచే వినూత్న ప్రయోగాలు చేయటం జరిగింది. మొట్టమొదటిసారిగా 'సామ్రాట్'

లోకాలోకనం

రాబందులు మళ్ళీ రామచిలుకలై వస్తున్నాయ్
చతురవచో నిధులౌతున్నాయ్
ప్రచారాన్ని పంచరంగుల కలల్ని పంచిపెడుతున్నాయ్
అందంగా కవిత్వం చెపుతున్నాయ్
మన ఆకలి చావులు వాళ్ళ కవిత్వానికి అందవు
వలస వేదనలు వాళ్ల కలల్లోకైనా రావు
ఇక్కడ పురుగుల మందులు
రైతులకు పరమాన్నాలైనా వాళ్ళు స్పందించరు.
అక్కడ గుజరాత్‌లో భూకంపానికి మాత్రం
హృదయం ద్రవిస్తుంది
వాళ్ళ కలం కవిత్వం కక్కుతుంది!
మాతృ హృదయం బాధ
అమ్మణ్ణమ్మకైతేనేం
బాబూ మోహన్‌కైతేనేం
అనుభవంలోకి వస్తేనే తెలుస్తుంది!
వాళ్ళు ఏ.సి.కార్లలో విహరిస్తారు - కవిత్వం రాస్తారు
అందమైన ఆడిటోరియాలు
వాళ్ళ కవిత్వానికి వేదికలవుతాయ్
కాశ్మీరీ శాలువాలు - విలువైన జ్ఞాపికలు
ఆ కవిత్వానికి నజరానాలౌతాయ్
మనిషి గుండెకింది చెమ్మను
స్పృశించని కవిత్వం రాయడం వాళ్ళకో ఫ్యాషన్!
రవాణా కాదు - పంచాయితీకాదు
న్యాయమూ కాదు - ఏకంగా
సాహిత్య శాఖ మంత్రులమంటారు
ఆదివారం అనుబంధాల్లో
చదివించే వ్యాసాలవుతారు!
ఇదంతా వాళ్ళకో అందమైన హాబీ!!
ఆకలి నైరూప్యం కాదని
మృత్యువు దాని స్వరూపమని
ఏటా వందల చావులు విలయతాండవం చేసినా
వాళ్ళు కవిత్వం చెప్పరు
ప్రోగ్రెస్ రిపోర్టుల్ని భుజాలకెత్తుకుని ఊరేగిస్తున్నారు!
ప్రశ్నించే బాల నాగమ్మల మొగుళ్ళని
శిలల్ని చేసినా
మాయల ఫకీరుకు మలితరంలోనైనా మరణం తప్పదు!
నిశిరాత్రుల్లో వెన్నెల మాయాజలతారులు
ఎన్ని పరిచినా చంద్రునికి గ్రహణం తప్పదు!
ప్రజల మస్తిష్కాలపై
మీడియా కమ్ముతున్న చీకటిని
రేపటి సూర్యుడు తన కిరణాల్తో
పటాపంచలు చేయక మానడు!

- హెచ్.రమేష్‌బాబు

అనే నాటకాన్ని అందరూ స్త్రీలచే నటింపజేసి తానే స్వయంగా దర్శకత్వం బాధ్యతలు చేపట్టి తాను పుట్టి పెరిగిన ఫకృదీనపాలెంలో అపూర్వమైన రీతిలో డబల్ డయాస్ (ఒకేచోట రెండు స్టేజీలు) నిర్మించి సుమారు 20 వేల మంది ప్రేక్షకుల ముందు, జిల్లా నలుమూలల నుండి వచ్చిన వందలాది మంది కళాకారులు, ప్రముఖ రాజకీయవేత్తల సమక్షంలో అపూర్వంగా ప్రదర్శించారు. 20 వేల మంది ప్రేక్షకులు వచ్చారు అంటే నమ్మబుద్ధికాదు. ఇది వాస్తవం, అంత మంది ఆ ప్రదర్శనను తిలకించారు. పెద్దలు తాటికొండ ప్రయోగాన్ని కొనియాడారు. అలాగే నిప్పురవ్వలు నాటకాన్ని కూడా 18 మంది స్త్రీలతో పిఠాపురం పక్కనే గల నాగులాపల్లి గ్రామంలో ప్రదర్శించారు. ఈ నాటకాన్ని టికెట్టు ప్రదర్శనగా వేశారు. తాటికొండ దర్శకత్వం వహించారు. తొలి ప్రధర్శనకే ప్రేక్షకుల్లో మంచి ఆదరణ వచ్చింది. ప్రస్తుతం "అల్లూరి సీతారామరాజు నాటకాన్ని" అందరూ స్త్రీలతో అన్ని రకాల హంగులతో ప్రయోగాత్మకంగా ప్రదర్శించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నంది నాటకాలపై మీ అభిప్రాయం ఏమిటి అన్నప్పుడు ఆయన నాటకాలకు నంది అవార్డులు అందించటం వరకు మంచి ప్రయత్నమన్నారు. అయితే ఆ నంది నాటకాలకు సెలెక్టు అవుతున్నది మాత్రం పేరు పొందిన సంస్థలే తప్ప చిన్న వాళ్లకు అవకాశాలు లేవు అన్నది వాస్తవం. నాటకాలను ఎంపిక చేయటంలోనే అవకతవకలు జరుగుతున్నాయన్నది నా అభిప్రాయం అన్నారు. పరిషత్ నాటకాలపై అభిప్రాయాన్ని కోరినప్పుడు, పరిషత్ నాటకాలు వుండబట్టే నాటకరంగం బతికివుందన్నారు. మద్యపానం సమస్యపై తాటికొండ నటించి దర్శకత్వం వహించిన "చల్‌చల్ గుర్రం" నాటిక అనేక బహుమతులనందుకుంది. 10 సార్లు ఉత్తమ నటుడు బహుమతులు తాటికొండకు వచ్చాయి. అదే చల్‌చల్ గుర్రం నాటికను విజయనగరం జిల్లా గరివిడిలో జరిగిన అఖిలభారత నాటికల పోటీల్లో ప్రదర్శించారు. అందులో 12 భాషలకు చెందిన నాటికలు పాల్గొన్నాయి. వాటిలో పాల్గొని బహుమతిని పొందారు. ఇదే నాటికను మధ్యప్రదేశ్‌లో జరిగిన నాటికోత్సవాల్లో దర్శించామన్నారు. మీకు నచ్చిన ఆధునిక నాటకం ఏది అన్నప్పుడు లంక సత్యానందం గారికి జాతీయస్థాయిలో పేరుతెచ్చిన 'బొమ్మలాట' నాటకం అన్నారు. నాటకాన్ని ఎంతగా ప్రదర్శించినా సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వాలన్నారు. తాటికొండ నిరంతరం నాటక కళపైనే అన్వేషణ సాగిస్తూ వుంటారు. ఏ గ్రామంలో పదిమంది యువకులు తనకంటపడితే వారిచేత ఒక నాటికనో, నాటకాన్నో ఆడించటం తన జీవితాయాశయాల్లో మొదటిదని అన్నారు. అన్ని విధాలుగా చదువు, సంస్కారం వున్న వాళ్ల చేత నాటకాలు ఆడించటం గొప్పకాదని, నిరక్షరాస్యులు, గ్రామీణ జీవితం నుండి పుట్టుకొచ్చిన మట్టి మనుషుల్ని ఏరుకొని వారిని ఉన్నతమయిన నటులుగా తీర్చిదిద్దడం తన ఆశయమన్నారు. ఇప్పటి వరకూ అనేక మంది స్త్రీ కళాకారిణులను పరిషత్ నాటకాలు ఆడే స్థాయికి శిక్షణ ఇచ్చానన్నారు. స్త్రీలు, పురుషులు కలిపి సుమారు 200 మందిని తాను కళామతల్లికి అందించగలిగానని, వారంతా తనను గురువుగా విశ్వసిస్తారన్నారు. తాను తొమ్మిదో తరగతి వరకూ మాత్రమే చదువుకున్నానన్నారు. రంగస్థలంపై నవరసాలు పోషించానని, అందులో హాస్యరసం అంటే తాను ఎక్కువ ఇష్టపడతానన్నారు.

ఈనాడు కళారంగానికి సాంస్కృతిక కాలుష్య ప్రమాదం ఏర్పడింది. దాని ప్రమాదం నుండి రక్షించుకోవటం ఎంతయినా అవసరం, అందుకు నా వంతు కృషిని సాగిస్తాను. అలాగే నేను ఇంతవరకూ "క్షీరసాగర మదనం" "చల్‌చల్‌గుర్రం" "సింహాచల అప్పన్న కొండదిగిరా" "గాజుపాత్ర" "దేవుడూనిద్రలే" "రుణం" "కాలజ్ఞానం, ఉష్‌కాకి, ఒంటెద్దుబండి వంటి నాటకాల్లో చేసిన పాత్రలకు న్యాయం చేశాను అనుకుంటున్నాను. మరెన్నో నాటకాలకు, నాటికలకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టానన్నారు. తాను నాటకరంగంపై రాణించటానికి తోడ్పాటునిచ్చింది మిత్రులు శ్రీ ఊర రాంబాబు గారని అన్నారు. దర్శక, నటనా రంగాల్లో ఎంతో పేరు పొందినా తనకంటూ ఏమీ ఆశించకుండా 'వృత్తి ప్రవృత్తి' నాటక రంగమే అంటూ సొంత కుటుంబంకంటే నాటకానికే జీవితాన్ని అంకితం చేయటం హర్షించదగ్గది. ఇలాంటి వారికి ప్రభుత్వం నుండి తగిన ప్రోత్సాహం ఉంటే ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేయగలరు. ★

ఆడపడుచులూ ఆలోచించండి

దగా పడిన అమ్మలార! దిగాలు పడిన అక్కలార!
ఆలోచించండి ఒక్కసారి! వెనుతిరిగి చూడండి ఒక్కసారి!
రాష్ట్ర పాలనంతా అరచేతిలో వైకుంఠం
హైటెక్కుపాలనంతా జిమ్మిక్కుల మయం
సింగపూర్ సింగారమంతా అవినీతిహారం
అందలం కోసం కోటి వరాల బాగోతం
॥దగాపడిన॥

అంగన్‌వాడి అమ్మలకు అష్టకష్టాలు కల్పించి
జీతమడిగితే గుర్రాలతో తొక్కించి
బత్తెమడిగితే లాఠీలతో బాదించి
బ్రతుకు బజారులో ఛిద్రం చేయించె
॥దగాపడిన॥

దీపం పథకమంటూ దీపాలు ఆర్పేసి
పొయ్యిలో పిల్లికి వాతలు పెట్టేసి
కుండలో బియ్యాన్ని బోర్ల నెట్టేసి
పేదల గుండెల్లో మంటలే రేపేసె
॥దగాపడిన॥

డ్వాక్రా పథకమంటూ ఢంకాలు మ్రోగించి
కష్టించిన సొమ్మంతా బ్యాంకుల్లో దాచేసి
ఆశల పల్లకీలో ఆకాశం వంక జూస్తుంటే
మొండిచెయ్యి చూపి మొట్టి కాయలు మొట్టేసె
॥దగాపడిన॥

దళిత మహిళల మాన, ప్రాణాలు ఖతం జేసి
గిరిజన మహిళల గుండు గీయించి బొట్లు పెట్టేసి
కేరింతలు కొట్టే పసిపిల్లలను అంగట్లో అమ్మేసి
రాజకీయ రంగుతో రిజర్వేషన్లకి మసిబూసె ॥దగాపడిన॥

కూటికి, గుడ్డకి దిన, దినం గండమాయె
త్రాగునీటికి క్షణ, క్షణం తద్దినమాయె
చేద్దామంటే చేతినిండ పనిలేక పస్తులాయె
ఆడపడుచులకి అంతులేని అవమానాలాయె
॥దగాపడిన॥

దగాకోరు మాటల్తో కోటలూ గడతారు
వంకదండాలెట్టి ఓట్లడగవస్తారు
కాకిలెక్కలు జెప్పి తోకలు జాడిస్తారు
అప్పులెన్నో తెచ్చి పప్పుబెల్లాలు పెడ్తారు
॥దగాపడిన॥

ప్రజాపోరాటంలో ముందున్నదెవ్వరో
అష్టకష్టాలలో ఆదరించినదెవ్వరో
అమ్మలందరూ ఆలోచించండి ఒక్కసారి
లౌకిక శక్తులకే ఓటు వేసి గెలిపించండి ఒక్కసారి
॥దగాపడిన॥

- వడ్లమాను వెంకటేశ్వర్లు

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

పర్మినెంట్ చేయడంలేదు

నేను పార్ట్‌టైం వాటర్‌మెన్ కమ్ గార్డెనర్‌గా మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏ విధమైన గైర్హాజరు లేకుండా పని చేస్తున్నాను. కాలేజీలో నన్ను పర్మినెంట్ చేయడానికి జిఓ లేదని అంటున్నారు. ఆ మధ్య జి.ఓ.ఎమ్.ఎస్.నెం.**21**, తేది **22-3-1994**లో విడుదల అయినది. ఆ జి.ఓ ప్రకారం కనీసం **5** సంవత్సరాల సర్వీసు ఉంటే పర్మినెంటు అని అన్నారు. నేను ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అధికార్లకు దరఖాస్తు చేసుకొన్నాను. అయినా పర్మినెంటు చేయలేదు. నేను ఎ.పి.అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (హైదరాబాద్)కు వెళ్ళాను. **1996**లో కేసు అయిపోయినది. నన్ను మాత్రం పర్మినెంటు చేయలేదు. అధికార్లకు మళ్లీ దరఖాస్తు చేసుకొన్నాను. మరి కొంతకాలానికి జి.ఓ.ఎమ్.ఎస్.నెం.**712** తేది **23-7-1997**లో వచ్చినది. ఈ జి.ఓ.లో **10** సంవత్సరాల సర్వీసు **1993** వరకు ఉంటే పర్మినెంటు అని అన్నారు. దీని ప్రకారం అధికార్లకు దరఖాస్తు చేసుకొన్నాను. అయినా ఫలితం లేకపోయింది. మరల ఎ.పి. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌కు వెళ్ళాను. నాకు **10** సంవత్సరాల సర్వీసు లేదని కేసు కొట్టి వేసినారు. అప్పటి నుండి ఇప్పటివరకు ఏమీ తెలక దిక్కు లేక అదే పని చేస్తున్నాను. ఇప్పటివరకు **17** సంవత్సరాలు గడిచింది. నేను ఏమి చేయాలో దయచేసి తెలుపగలరని ప్రార్థన.

- ఇంద్రకంటి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్, వరంగల్‌జిల్లా

మీరు న్యాయపరంగా (చట్టపరంగా) న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఆ అవకాశాలను వినియోగించుకున్నారు. రెండుసార్లు ట్రిబ్యునల్‌లో వేశానంటున్నారు. వాటి ఫలితం కూడా మీకు తెలిసిందే. ముఖ్యంగా మీరు వేసిన మొదటి ఓ.ఎ. ప్రకారం మీ అప్లికేషన్‌లో 'కన్‌సిడర్' చేయమని వచ్చి ఉంటుంది. (ఫలితం ఏమిటో మీరు రాయలేదు) దీని ప్రకారం జి.ఓ.ఎమ్.ఎస్.నెం.212లో 5 సంవత్సరాల కనీస కాలపరిమితితో పాటు అవసరమున్నా 'అంతకుముందే ఎగ్జిస్టెన్స్ వేకెన్సీ'ని బట్టి ఇవ్వమని అని ఉంటారు. ఈ అవకాశాన్ని కొంతమంది వినియోగించుకొని పర్మినెంట్ అయ్యారు. పొందలేని వారు మళ్ళీ కోర్టుని ఆశ్రయించారు. హైకోర్టులో కూడా సింగిల్ జడ్జి ఉద్యోగాలు ఇవ్వాల్సిందే అని చెప్పారు. కాని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం కొన్ని కారణాల వల్ల కచ్చితంగా ఇవ్వాలి అనేం లేదు అంటూ కొట్టివేశారు. అవి ఇప్పడు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్నాయి. ఆ తీర్పు వెలువడితే అది అనుకూలంగా ఉంటే మీరు మళ్ళీ కోర్టుని ఆశ్రయించవచ్చు.

అమ్మ-నాన్న కావాలి

నేను **9**వ తరగతి చదువుతున్నాను. మా అమ్మా నాన్నా విడిపోయి వున్నారు. వారి మధ్య ఎప్పుడూ గొడవలు వస్తూ వుండేవి. మా అమ్మను నాన్న చిత్రహింసలు పెట్టేవాడు. అయినా మా అమ్మ సహించింది. మా నాన్నకు అన్ని దురలవాట్లు ఉన్నాయి. దాని వలన ఊరికే గొడవలు వచ్చేవి. గొడవలు భరించలేక మా అమ్మ మా మేనమామ ఇంటికి వెళ్ళి కొన్ని రోజులు వుండి వచ్చింది. అయినా మారలేదు. మరల మమ్మల్ని తీసుకొని మా మేనమామ ఇంటికి వెళ్ళింది. గ్రామ పెద్దల మధ్య పంచాయితీకి పిలిపించినా నాన్న వచ్చేవాడు కాదు. అలాగే నేను **13** సంవత్సరాల వరకు అమ్మతో పాటు మా మేనమామ వద్ద పెరిగాను. మా తల్లిదండ్రులు విడాకులు తీసుకోలేదు. మా అమ్మానాన్న గురించి బంధువులు అనే మాటలతో నాకు చదువు మీద శ్రద్ధ పూర్తిగా తగ్గిపోయింది. నిత్యం రకరకాల ఆలోచనలు వస్తుంటాయి. తట్టుకోలేకపోతున్నాను. మీరే నాకు ఒక దారిని చూపిస్తారని ఆశిస్తున్నాను. మా అమ్మ, నాన్న మరల కలవవచ్చా? మార్గం చెప్పగలరు.

- పి.పి.రాజు, శివలింగపురం.

చిన్నా! నీ ఆవేదన వింటుంటే చాలా బాధేస్తుంది. నీ ఆవేదనలో పది శాతం అన్నా మిమ్మల్ని కన్నవాళ్లకు ఉంటే నీ భవిష్యత్తుని వారు దృష్టిలోకి తీసుకుని ఇరువురి స్వార్థాలు, పట్టింపులు కొంత వద్దనుకొని మీ కోసం ఆలోచించగలిగితే మీ కుటుంబ పరిస్థితి ఇలా అయ్యేది కాదు. మన చట్టాలు భార్య, భర్త కలిసి ఉండాలన్నా రిస్టిట్యూషన్ ఆఫ్ కాంజుగల్ రైట్స్, విడిపోవాలన్నా విడాకుల పిటిషన్ వేసుకునే అవకాశాలున్నాయి. ఒక తీరుగా చెప్పాలంటే వారి సంతానాన్ని కూడా వాళ్ళ 'ఆస్తి'లాగే పిల్లల మీద తల్లిదండ్రులకు హక్కులు ఇచ్చారు. 12 సంవత్సరాల లోపు తల్లి వద్ద అని, అటు తరువాత మేజర్ అయ్యేంత వరకు తండ్రి వద్ద ఉండాలని చట్టం ఉంది. కాని తల్లిదండ్రులు పిల్లల్ని ఎలా చూసుకోవాలి అనేది చట్టంలో లేదు. తల్లిదండ్రుల ప్రేమల్ని పిల్లలు ప్రేమతో పొందాల్సిందే తప్పితే చట్టపరమైన హక్కుగా పొందలేరు. అలాంటి చట్టాలు లేవు.

కాని నీ ఆవేదన కొన్నాళ్ళు మరిచిపోయి చదువు మీద శ్రద్ధ వహించి, సమాజంలో ఉన్నత స్థానం పొందే వ్యక్తిగా నీ భవిష్యత్తుని మార్చుకోగలిగితే ఈ సమాజం, మీ తల్లిదండ్రులు మీకు ఆనాడు లొంగిపోతారు. "నాలెడ్జ్ ఈజ్ పవర్" కొన్నాళ్ళు నీ ఆవేదన పక్కకు పెట్టి చదువుపై శ్రద్ధ వహించు.

రుచి

మైసూర్ పాక్



కావలసిన వస్తువులు:

శనగపిండి: 2 గ్లాసులు పంచదార: 2 గ్లాసులు డాల్డా: 2 గ్లాసులు

చేసే విధానం: ముందుగా శనగపిండిని జల్లించుకోవాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి శనగపిండి పోసి కొద్దిగా డాల్డాను వేసి అడుగంటకుండా దోరగా వేయించి దించి పక్కన పెట్టుకోవాలి. మరో గిన్నెలో పంచదార వేసి కొద్దిగా నీళ్ళుపోసి పాకం వచ్చేదాకా స్టవ్ మీద ఉంచాలి. పాకం రాగానే శనగపిండిని వేసి గట్టి పదేవరకూ ఉండలు కట్టకుండా బాగా కలియ పెడుతుండాలి. మరగ పెట్టి ఉంచిన డాల్డాను పిండిలో పోయాలి. అడుగంటకుండా కలియబెడుతూ మరి కాస్త డాల్డాను పోయాలి. ఇప్పుడు కలిపితే పిండి గుల్లగా తయారవుతుంది. మరోసారి డాల్డాను పోసి కలిపి ఒక పెద్ద ప్లేటుకు పల్చగా నెయ్యిగాని, డాల్డాగాని రాసి ఈ మిశ్రమాన్ని పోయాలి. సరిపడేంత మందం ఉండేలా చూసుకొని చాకుతో ముక్కలుగా కోసుకోవాలి. పది నిముషాల వరకు ఆరనిచ్చి ఒక్కొక్క ముక్కను విడగొట్టి స్టీల్ డబ్బాలో పెట్టుకుని నిల్వ చేసుకోవాలి.

మసాలా వడలు

కావలసిన వస్తువులు:

శనగపప్పు: 1 గ్లాసు
పుదీనా: 1 కట్ట
కరివేపాకు: 4 రెబ్బలు
అల్లం: చిన్న ముక్క
లవంగాలు: 10
వెల్లుల్లి: ఒకటి
పచ్చిమిర్చి: 10
కొత్తిమీర: 1 కట్ట
ఉల్లిపాయ: ఒకటి
చెక్క: 5 గ్రాములు
నూనె: పావు కేజీ

చేసే విధానం: శనగపప్పు నాన బెట్టాలి. పుదీనా, కొత్తిమీర, కరివేపాకు శుభ్రంగా కడిగి కట్ చేసుకోవాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం ముక్కను చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. లవంగాలు, చెక్క, వెల్లుల్లిపాయ దంచుకోవాలి. శనగపప్పు కొంచెం మెదిగే వరకూ రుబ్బి వీటన్నిటినీ కలిపి రుబ్బాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. కాగాక ఈ పిండిని వడలుగా వేసుకోవాలి. ఇవి పల్చగా చేసుకొని బాగా కాలనిస్తే కరకరలాడుతూ ఉంటాయి. ఇవి వేడిమీద తింటే బాగుంటాయి. చట్నీతో ఇంకా బాగుంటాయి.

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫోటోతో పాటు రాసిన వారి ఫోటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:

రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఒ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది